
హైదరాబాద్ వార్త



## వివాహేతర సంబంధమే..?

### వీడిన యువతి హత్యకేసు మిస్టరీ

సైదాబాద్, అక్టోబరు 29 ప్రభాతవార్త: ఐఎస్ సదన్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం జరిగిన స్వప్న హత్య కేసులో మిస్టరీ వీడింది. భర్త ప్రేమ్‌కుమారే స్వప్నను హత్య చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలం కొత్తపేటకు చెందిన మోహన్ కుమార్తె స్వప్నకు నెల రోజుల క్రితం ప్రేమ్‌కుమార్‌తో వివాహమైంది. స్వప్న చంపాపేట రాజిరెడ్డినగర్‌లో అద్దె ఇంట్లో ఉంటుంది. అయితే కొద్ది రోజులుగా స్వప్న ఇంటికి తరచుగా బయటి వ్యక్తులు వచ్చి పోతుండడంతో ఇంటిని ఖాళీ చేయమని యజమాని చెప్పాడు. ఈ క్రమంలోనే శనివారం స్వప్న దారుణ హత్యకు గురైంది. ప్రేమ్ కుమార్ భవనంపై నుంచి కింద పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడు. యువతి తండ్రి మోహన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. స్వప్న కాల్‌డాటాను పరిశీలించడంతో పాటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ప్రేమ్ కుమార్ వాంగ్మూలాన్ని పోలీసులు నమోదు చేశారు. హత్యకు వివాహేతర సంబంధమే కారణమని పోలీసుల విచారణలో తేలినట్లుగా సమాచారం. శనివారం ప్రేమ్ కుమార్ ఇంటికి వచ్చిన సమయంలో మరో యువకుడు సతీష్ అక్కడ ఉండడంతో స్వప్నకు. ప్రేమ్ కుమార్‌కు మధ్య గొడవ జరిగింది. దీంతో ఆగ్రహానికి గురైన ప్రేమ్ కుమార్ ఇంట్లో ఉన్న కత్తితో స్వప్నపై దాడి చేసి దారుణంగా హత్య చేశాడు. అనంతరం స్వప్నను హత్య చేసిన ప్రేమ్‌కుమార్‌పై సతీష్ దాడికి పాల్పడ్డాడు. ఈ క్రమంలోనే ప్రేమ్‌కుమార్‌ను సతీష్ భవనంపై నుంచి కిందకు తోసివేసినట్లుగా పోలీసుల విచారణలో తేలిందని సమాచారం. ప్రస్తుతం సతీష్ పరారీలో ఉన్నాడు. కేసు దర్యాప్తులో ఉంది.

## మసాజ్ సెంటర్ మహిళకు వేధింపులు

### పంజాగుట్ట పిఎస్‌లో బాధితురాలి ఫిర్యాదు

హైదరాబాద్, అక్టోబర్ 29, ప్రభాతవార్త: పంజాగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో ఓమసాజ్ సెంటర్ ఓనర్ నిర్వాకం వెలుగులోకి వచ్చింది. సెంటర్లో అసాంఘీక కార్యకలాపాలు చేయాలంటూ ఉద్యోగిపై యజమాని ఒత్తిడి చేశారు. మసాజ్‌కు వచ్చే పురుషులకు అనుగుణంగా నడుచుకోవాలంటూ బాధితురాలిపై ఒత్తిడి చేశాడు. ఆమె లొంగకపోవడంతో బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో ఆ మహిళ ఓనర్ వేధింపులు భరించలేక పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బండ్లగూడ ప్రాంతానికి చెందిన మహిళ పంజాగుట్టలోని ఓమసాజ్ సెంటర్‌లో ఫిట్‌నెస్ శిక్షకురాలిగా చేరింది. నెలకు లక్షల వేతనం అంటూ సెంటర్ యజమాని హామీ ఇచ్చాడు. దీంతో ఆమె ఉద్యోగంలో జాయిన్ అయ్యింది. దాదాపు 20 రోజులతర్వాత మసాజ్‌కోసం వచ్చే పురుషులకు అనుకూలంగా నడుచుకోవాలంటూ ఆమెపై ఓనర్ తీవ్రమైన ఒత్తిడి చేశాడు. అందుకు ఆమె ఒప్పుకోలేదు. దీంతో బెదిరింపులు ఎక్కువకావడంతో తనకు ప్రాణహాని ఉం దని పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో మసాజ్ సెంటర్ యజమానిపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## హత్య చేసిన నిందితుల అరెస్టు

సంజీవరెడ్డి నగర్, అక్టోబర్ 29, ప్రభాతవార్త : ఎస్సార్‌నగర్ ఇన్స్‌పెక్టర్ పి. వెంకట రాంప్రసాద్ రావు తెలిపిన వివరాల ప్రకారం ఎస్సార్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దాసరం బస్తీలో తరుణ్‌ను హత్య చేసిన నిందితులు షరీఫ్, రాహుల్, అభిషేక్, నాగరాజులను ఎస్ఆర్ నగర్ పోలీసులు అరెస్ట్ చేసి జ్యూడీషియల్ కస్టడికీ శనివారం రాత్రి తరలించినట్లు ఇన్స్‌పెక్టర్ వెంకట రాంప్రసాద్ రావు తెలిపారు.

## గద్దర్ కూతురు వెన్నెల ప్రచారం ప్రారంభం

### కాంగ్రెస్ అభ్యర్థి గెలుపుకు పనిచేయాలి: సర్వే



కంటోన్మెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గద్దర్ వెన్నెలను అభినందిస్తున్న కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్య నారాయణ తదితరులు

కంటోన్మెంట్, అక్టోబర్ 29 ప్రభాతవార్త: కంటోన్మెంట్ నియోజక వర్గం కాంగ్రెస్ అభ్యర్థి విజయానికి కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు కలిసి కట్టుగా పనిచేయాలని కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్య నారాయణ తెలిపారు. కాంగ్రెస్ కాంగ్రెస్ అభ్యర్థిగా వెన్నెలకు టికెట్ ఖరారు కావడంతో కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్య నారాయణను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సర్వే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేస్తున్న నాయకులను, కార్యకర్తలను, అదే విధంగా టికెట్ ఆశించిన బంగపడ్డవారిని కూడా కలుపు కోవాలని సూచించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని దీమా వ్యక్తం చేశారు. కంటోన్మెంట్ బిజెపి సీనియర్ నాయకులు అల్లాడి గౌరి శంకర్, నంది కంటి రవి, బాబురావ్, శ్రీనాథ్, ఆరోగ్యం, జూడ్, డాక్టర్ నవనీత్ సర్వే పాల్గొన్నారు.



ప్రఖ్యాత నాట్యశిక్షణా సంస్థ అభినేత్రి ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధాన మందిరంలో ఆదివారం కళామూలికలతో నృత్య కళామాల కన్నులపండువగా జరిగింది.

## సంక్షేమ పథకాలను గడపగడపకు తీసుకెళ్లాలి: మంత్రి కెటిఆర్



వనస్థలిపురం, అక్టోబరు 29 ప్రభాతవార్త: గడపగడపకు బీఆర్ఎస్ పార్టీ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి తిరిగి రాష్ట్రంలో మూడవసారి కెసిఆర్‌ను ముఖ్యమంత్రిని చేయాలని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ పిలుపునిచ్చారు. వనస్థలిపురం డివిజన్‌లోని జి.ఎస్.ఆర్ కన్వెన్షన్‌లో ఎల్బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అధ్యక్షతన ఆదివారం జరిగిన బూత్ కమిటీల విస్తృతస్థాయి సమావేశానికి మంత్రి కేటీఆర్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, బూత్ కమిటీల సభ్యులు ప్రతిరోజు ప్రజల వద్దకు వెళ్లి తొమ్మిదిన్నర సంవత్సరాలలో బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను వివరించాలని కోరారు.

మిగతా లోపలి పేజీలో..

# అభ్యర్థుల ప్రకటనలో జాప్యమేల?

### బిజెపి నాన్చుడు ధోరణితో శ్రేణుల్లో తగ్గిన జోష్



హైదరాబాద్, అక్టోబరు 29 ప్రభాతవార్త : గ్రేటర్‌లో బిజెపి జోష్ తగ్గిందా..క్యాడర్ నిరుత్సాహానికి గురవుతున్నారా.. అంటే అవుననే సమాధానాలు వినిపిస్తున్నాయి. అభ్యర్థుల జాబితా ప్రకటించడంలో మొదట్లో దూకుడు ప్రదర్శించిన బిజెపి అంబర్‌పేట, ముషీరా బాద్, నాంపల్లి, జూబ్లీహిల్స్, ఉప్పల్, ఎల్బీనగర్, మలక్‌పేట్, రాజేంద్రనగర్, మల్కాజ్‌గిరి, కంటోన్మెంట్, సికింద్రాబాద్, సనత్‌నగర్, కూకట్‌పల్లి, శేరిలింగంపల్లిలలో అభ్యర్థులను ప్రకటించకుండా నాన్చుడు ధోరణి అవలంభించడమే ఇందుకు కారణం. కాగా సనత్ నగర్ నుంచి మర్రి శశిధర్‌రెడ్డి, మల్కాజ్‌గిరి నుంచి ఆకుల రాజేందర్, రాజేంద్రనగర్ నుంచి తోకల శ్రీనివాస్‌గౌడ్, అంబర్‌పేట నుంచి డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు అభ్యర్థిత్వాలను పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఇక ఉప్పల్ నుంచి ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, వీరేందర్‌గౌడ్, ఎల్బీనగర్ నుంచి సామ రంగారెడ్డి, వంగ మధుసూదన్‌రెడ్డి, గంగిడి మనోహర్‌రెడ్డిలు ఆశలు పెట్టుకోగా మేడ్చల్ నుంచి విక్రమ్‌రెడ్డి టికెట్ ఆశిస్తు న్నారు. అలాగే జూబ్లీహిల్స్ నుంచి డాక్టర్ పద్మ వీరపనేని, లంకల దీపక్‌రెడ్డి, విక్రమ్‌గౌడ్, సనత్‌నగర్ నుంచి మర్రి శశిధర్‌రెడ్డి, ఆకుల విజయ, ముషీరాబాద్ నుంచి బండారు దత్తాత్రేయ కుమార్తె విజయలక్ష్మీ, విక్రమ్ గౌడ్, గోపాల్‌రెడ్డి, శేరిలింగంపల్లి నుంచి యోగానంద్, రవికుమార్, కూకట్‌పల్లి నుంచి మాధవరం కాంతారావు, ఎం.ప్రేమ్‌కుమార్, వడ్డేపల్లి రాజేశ్వర్, మలక్‌పేట నుంచి సురేందర్‌రెడ్డి, లింగాల హరిగౌడ్,, చీకోటి ప్రవీణ్, సికింద్రాబాద్ నుంచి బండ కార్తీకరెడ్డి, జయసుధ, ఆదం విజయ్‌కుమార్ ఆశావహుల పేర్లను పార్టీ అధిష్టానం పరిశీలిస్తోంది.

**వలసలుండేనా..** కాంగ్రెస్ అభ్యర్థుల ప్రకటన అనంతరం బిజెపిలోకి వలసలుంటాయని కమలనాథులు అంచనా వేస్తున్నారు. అందులో భాగంగానే పలు స్థానాల్లో అభ్యర్థుల ఎంపిక ఆలస్యమవుతుందనే ప్రచారం జరుగుతోంది. కాంగ్రెస్ రెండో జాబితాను ఇటీవల విడుదల చేసింది. ఆపార్టీలో టిక్కెట్ల కేటాయింపుపై పలు చోట్ల అసంతృప్తి వ్యక్తమవుతోంది. వారిని బిజెపిలోకి ఆహ్వానించి టిక్కెట్టు ఇచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే కొందరు అభ్యర్థులతో ఆ పార్టీ ముఖ్యులు చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల్లోని అసంతృప్తులను చేర్చుకుని, టికెట్ ఇచ్చే అంశం పార్టీ అధిష్టానం పరిశీలిస్తున్నట్లు సమాచారం. వీటన్నింటిపై స్పష్టత వచ్చిన తర్వాతే బిజెపి మూడో జాబితా విడుదల ఉంటుందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. అప్పటి వరకు బిజెపి అభ్యర్థులపై ఉత్కంఠ కొనసాగనుంది.

**ఒకటి తర్వాతే జాబితా..** బిజెపి మూడవ జాబిత నవంబరు ఒకటి తర్వాతే విడుదల చేసే అవకాశం ఉందని పార్టీ నేతలు పేర్కొంటున్నారు. ఈ నెల 30, 31 తేదీల్లో ఢిల్లీలో పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశమవుతుంది. నవంబరు ఒకటవ తేదీన పార్లమెంటరీ బోర్డు సమావేశం ఉంది. జనసేనతో పొత్తు ఉన్నందున ఆ అంశంపై పార్టీ పార్లమెంటరీ బోర్డులో చర్చించనున్నారు. అందువల్ల మూడవ జాబితా ఒకటి తర్వాతే ప్రకటించే అవకాశం ఉందని ఆపార్టీ సీనియర్ నేత పేర్కొంటున్నారు. 52 మంది అభ్యర్థులతో పార్టీ తొలి జాబితా విడుదల కాగా, శుక్రవారం మూడవ జాబితాలో మహబూబ్‌నగర్ అభ్యర్థిని ప్రకటించిన విషయం తెలిసిందే. బిఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు ప్రచారంలో దూసుకెళ్తుండగా బిజెపి అభ్యర్థులను ప్రకటించక పోవడంతో బిజెపి శ్రేణులు తలలు పట్టుకుంటున్నారు.

## మద్దతు దారులతో విష్ణువర్ధన్‌రెడ్డి సమావేశం



రాజీవ్‌నగర్‌లో మద్దతు దారులతో సమావేశం అయినా జూబ్లిహిల్స్ నియోజకవర్గం మాజీ శాసన సభ్యులు పి.విష్ణువర్ధన్‌రెడ్డి

యూసుఫ్‌గూడ, అక్టోబర్ 29, ప్రభాతవార్త : ఐదు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని పార్టీ పటిష్టత కోసం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పాటుపడిన పిజెఆర్ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని జూబ్లిహిల్స్ మాజీ శాసన సభ్యులు పి. విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం రాజీవ్‌నగర్‌లో తన మద్దతు దారుతో సమావేశం ఏర్పాటుచేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా ఈసారి కాంగ్రెస్ పార్టీ అధిష్టానం విష్ణువర్ధన్‌రెడ్డికి సీటు కేటాయించకుండా వేరే వాళ్ళకు కేటాయించడంతో తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. 52సంవత్సరాల నుండి తమ కుటుంబం కాంగ్రెస్ పార్టీకి సేవలు చేస్తూ వస్తుందని పెద్దమ్మ గుడితో పాటు గాంధీభవన్‌ను కూడా గుడిలాగే భావించామని అయినా కొందరు తమను అనగదొక్కే ప్రయత్నంలో తమకు సీటు రాకుండా అడ్డుపడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. హైదారాబాద్ నగరంలో కాంగ్రెస్ పార్టీ అంటేనే పిజెఆర్ అనీ అలాంటిది తమకు కాంగ్రెస్ పార్టీ సీటు కేటాయించకుండా తీవ్ర మనోవేదనకు గురయ్యేలా చేసిందన్నారు. గతంలో పాలకులు, తమను పార్టీలో సముచిత స్థానం కల్పించారని ప్రస్తుతం డబ్బుకే ప్రాధాన్యత ఇస్తూ సీటు కేటాయింపులో భేరాలు మాట్లాడుతున్నారని అన్నారు. ఎవ్వరు ఎన్ని అడ్డంకులు సృష్టించిన తమను నమ్ముకున్న నాయకుల కోసం తదుపరి రెండుమూడు రోజుల్లో నిర్ణయం ప్రకటిస్తానని పేర్కొన్నారు.

# స్మార్ట్‌గా సోషల్ వార్



**స్థానిక అంశాలపైనా.. బస్తీలు, కాలనీ స్థాయి నుంచి వివిధ అంశాలను ప్రచారంలో ప్రత్యేకంగా ప్రస్తావిస్తున్నారు. అధికార పార్టీ నాయకులకు సంబంధించిన సోషల్ టీములు ఇప్పటి వరకు చేసిన అభివృద్ధి, సంక్షేమం, ఇకపై చేయబోయే హామీల గురించి అభివృద్ధి పనుల గురించి విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. మరో వైపు ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు తాము గెలిస్తే స్థానిక సమస్యలను పరిష్కరిస్తామని, తమ పార్టీ అధికారంలోకి వస్తే చేసే పథకాలు, అభివృద్ధి అంశాల గురించి వైరల్ చేస్తున్నారు. అదే విధంగా ఇప్పటి వరకు అధికారంలో ఉన్న ప్రభుత్వ వైఫల్యాలు, నెరవేరని హామీల గురించి ఎత్తిచూపుతున్నారు.**

### ఎన్నికల ప్రచారానికి వాట్సాప్, ఫేస్‌బుక్ యాప్‌లను వినియోగించుకుంటున్న రాజకీయ పార్టీలు

### యూట్యూబ్ లింక్‌లు,లైవ్‌ల ద్వారా ప్రచార కార్యక్రమాలు




హైదరాబాద్, అక్టోబరు 29 ప్రభాతవార్త : ఈసారి సాధారణ ఎన్నికల్లో సోషల్ మీడియా ప్రచారానికి పార్టీల అభ్యర్థులు ఎక్కువ ఆసక్తి చూపడం విశేషం. ఇందుకుగాను ప్రత్యేకంగా సాంకేతిక పరిజ్ఞానం ఉన్న నిపుణులను ఉపయోగిస్తున్నారు. ఫేస్‌బుక్ లైవ్‌లు, యూట్యూబ్ లైవ్ ద్వారా ప్రచారం సాగిస్తున్నారు. అధికార పార్టీ అభ్యర్థులు ఇప్పటి వరకు చేసిన అభివృద్ధి పనులను వివరిస్తుండగా..ప్రత్యర్థి పార్టీల వారు ప్రభుత్వ వైఫల్యాలను తమ ప్రచారంలో ఎండగడుతున్నారు. సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఆయా పార్టీల అభ్యర్థులు ప్రచారం చేస్తున్నప్పటికీ గతంలో ఎన్నడూ లేనవిధంగా ఈసారి స్మార్ట్ ప్రచారానికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తుండడం గమనార్హం. ప్రజల నుంచి సైతం సోషల్ మీడియా ప్రచారానికి ఎక్కువ ఆసక్తి కనిపించడం విశేషం. దీంతో గతానికి భిన్నంగా విచ్చలవిడిగా కరపత్రాలు పంచడం, ప్రెస్‌మీట్లు పెట్టడం లాంటి కార్యక్రమాలు తగ్గించారు.ప్రతి ఒక్కరికి స్మార్ట్ ఫోన్ ఉండడం, ఇంటర్ నెట్ అపరిమితంగా వినియోగిస్తున్న నేపథ్యంలో సామాజిక మాధ్యమాల ద్వారా భారీ ఎత్తున ప్రచారం చేసేందుకు అభ్యర్థులు ప్రత్యేక ఏర్పాట్లు చేసుకున్నారు. ఇందులో భాగంగా నియోజకవర్గం, డివిజన్, వార్డుల వారీగా కులాలు, సంఘాల వారీగా, యువజన, మహిళా సంఘాల పేరిట ప్రత్యేకంగా వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసుకున్నారు.సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారాన్ని నిర్వహించేందుకు గాను ప్రత్యేకంగా జీతాలు ఇచ్చి మరీ సాంకేతిక పరిజ్ఞానం ఉన్న నిపుణులను ఉపయోగిస్తున్నారు. నియోజకవర్గంలో ఎక్కడ ప్రచారం చేసినా ఆయా ప్రచారం అన్ని గ్రూపుల్లో వచ్చే విధంగా ప్లాన్ చేసుకుని ముందుకు వెళుతున్నారు. ఫేస్‌బుక్ లైవ్‌లు, యూట్యూబ్ లైవ్‌లు సైతం పెట్టుకుని ప్రచారం సాగిస్తున్నారు. పార్టీల మేనిఫెస్టోలోని పథకాల గురించి ప్రచారం చేస్తూనే స్థానిక అంశాలనూ ప్రచారాస్త్రాలుగా చేసుకుంటున్నారు. కరపత్రాలను పరిమిత సంఖ్యలో ముద్రించి, వాటిని పీడీఎఫ్ ఫైల్ తయారు చేయించి వాట్సాప్ గ్రూపుల ద్వారా భారీగా వైరల్ చేస్తున్నారు. వాట్సాప్ స్టేటస్‌లకు సైతం మరింత ప్రాధాన్యత పెరగడం గమనార్హం. వ్యక్తుల వాట్సాప్ స్టేటస్‌లను బట్టి సదరు వ్యక్తి ఆలోచనలను అంచనా వేసుకుంటు అందుకు అనుగుణంగా అలాంటి వ్యక్తులను కన్విన్స్ చేసుకునే ప్రయత్నాలు చేస్తున్నారు.కొందరు యువకులు మాత్రం పార్టీలకు అతీతంగా ప్రభుత్వ వైఫల్యాలు, అపరిష్కృత సమస్యలు, పోటీ పరీక్షల విషయమై ప్రభుత్వ వైఫల్యాలు, పేపర్ లీక్‌లు తదితర అంశాలను వైరల్ చేస్తుండగా, స్థానిక సమస్యలను విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.

# చార్మినార్ ఎంఐఎంకు కంచుకోటే

### 1967 నుంచి వరుస విజయాలే!




చార్మినార్, అక్టోబరు 29 ప్రభాతవార్త : చార్మినార్ నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి నేటి వరకు 1967 నుంచి 2018 వరకు జరిగిన ప్రతీ అసెంబ్లీ ఎన్నికల్లో చార్మినార్ నియోజకవర్గం నుంచి ఎంఐఎం పార్టీకి చెందిన అభ్యర్దులు ఎన్నికల్లో విజయం సాధిస్తున్నారు. స్వర్గీయ సుల్తాన్ సలావుద్దీన్ ఓవైసీ 1967,1972, 1978,1983,అసెంబ్లీ ఎన్నికల్లో చార్మినార్ నుంచి స్వతంత్ర అభ్యర్దిగా పోటీ చేసి విజయం సాధించారు. 1985లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో సుల్తాన్ సలావుద్దీన్ ఓవైసీ హైదరాబాద్ పార్లమెంట్ నుంచి పోటీ చేసి గెలుపొందారు.కాగా1985లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో చార్మినార్ నుంచి మహ మ్మద్ ము క్రముద్దీన్ స్వతంత్ర అభ్యర్దిగా,1989లో విరాసత్ రసూల్ ఖాన్,1994,1999 ఎన్నికల్లో ఎంఐఎం అధ్యక్షులు,హైదరాబాద్ ఎంపి అసదుద్దీన్ ఓవైసీలు ఎంఐఎం పార్టీ తరుపున పోటీ చేపి గెలు పొందారు. యాకుత్‌పుర నియోజకవర్గం శాసన సభ్యులుగా కొనసాగుతున్న సయ్యద్ అహ్మద్ పాషాఖాద్రి 2004, 2009, 2014జరిగి ఎన్నికల్లో చార్మినార్ నుంచి మూడు సార్లు చార్మినార్ నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించారు.కాగా యాకుత్‌పుర నియోజకవర్గం నుంచి శాసన సభ్యులుగా వరుసగా ఐదు సార్లు విజయం సాధించిన ముంతాజ్ అహ్మద్ ఖాన్ 2018లో జరిగిన ఎన్నికల్లో మాత్రం చార్మినార్ నియోజకవర్గం నుంచి పోటీ చేశారు.బిజెపి అభ్యర్దిపై 32,586 ఓట్ల తేడాతో ముంతాజ్ అహ్మద్ ఖాన్ గెలు పొందారు.చార్మినార్ నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి ఇంత వరకు ఎంఐఎం పార్టీ విజయం సాధిస్తున్నది.కాగా ఓవైసీ కుటుంబానికి చార్మినార్ నియోజకవర్గం అన్ని విధాల కలిసి రావటంతో 2023లో జరుగుతున్న ఎన్నికల్లో చాంద్రాయణగుట్ట శాసన సభ్యులు అక్బరుద్దీన్ ఓవైసీ తనయుడు డాక్టర్.నూరుద్దీన్ ఓవైసీని చార్మినార్ నియోజకవర్గం నుంచి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయించాలని ఎంఐఎం భావిస్తున్నట్టు సమాచారం.

**చార్మినార్ టిక్కెట్ ఆశిస్తున్న కాంగ్రెస్ నాయకులలో తీవ్ర ఉత్కంఠ**

కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ప్రకటించిన వంద స్థానాలలో చార్మినార్ అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్దిని ప్రకటించక పోవటంతో టిక్కెట్ ఆశిస్తున్న నాయకులలో తీ వ్ర ఉత్కంఠత నెలకుంది.చార్మినార్ నియోజకవర్గానికి చెందిన ఐదు మంది నాయకులు టిక్కెట్ కోసం ధరఖాస్తులు పెట్టుకున్నారు.మొదటి జాబితాలోనే పార్టీ అధిష్టానం బహదూర్‌పుర, చాంద్రాయణగుట్ట, యాకుత్‌పుర,కార్వాన్,మలక్‌పేట్ నియోజకవర్గాలకు చెందిన అభ్యర్దుల పేర్లను ప్రకటించిన విషయం విధితమే.కాగా రెండవ జాబితాలో కూడ టిక్కెట్ ఆశిస్తున్న నాయకులకు నిరాశే మిలిగింది.పాతబస్తీకి చెందిన చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి కె.వెంకటేష్,టిపిసిసి కార్యదర్శి ముజీబుల్లా,కాంగ్రెస్ నాయకులు అస్గర్ అలీ బేగ్,షహనవాజ్,మురళీ కృష్ణలు చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ టిక్కెట్ కోసం ధరఖాస్తులు చేసుకున్నారు.బిజెపి,బిఆర్ఎస్ పార్టీలు మొదటి జాబితాలోనే చార్మినార్ నియోజకవర్గం నుంచి పోటీ చేసే అభ్యర్దుల పేర్లను ప్రకటించారు.కాగా కాంగ్రెస్ పార్టీ మాత్రం ఇంత వరకు అభ్యర్దులను ప్రకటించక పోవటంతో అభ్యర్దులలో తీవ్ర ఉత్కంఠత నెలకుంది. పాతబస్తీకి చెందిన ప్రముఖ వ్యాపారి,రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు అలీ మస్కతి పార్టీని విడిచి కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో నెల రోజుల క్రితం చేరారు.వ్యాపారి వేత్త అలీ మస్కతి కాంగ్రెస్ తరుపున చార్మినార్ నియోజకవర్గం నుంచి ఎన్నికల బరిలోకి దిగుతారని ప్రచారం జరిగింది.అలీ మస్కతి చార్మినార్ నుంచి పోటీ చేస్తే ఎంఐఎం కాంగ్రెస్ పార్టీల మధ్య పోటీ ఉంటుందని కాంగ్రెస్ నాయకులు భావించినప్పటికి అలీ మస్కతి మాత్రం పోటీకి దూరంగా ఉన్నారు.2018 ఎన్నికల్లో చార్మినార్ నుంచి కాంగ్రెస్ పార్టీ తరుపున పోటీ చేసిన మాజీ కార్పొరేటర్ మహ్మద్ గౌస్ మూడవ స్థానంలో నిలిచారు.ప్రస్తుతం మాజీ కార్పొరేటర్ మహ్మద్ గౌస్ ఎంఐఎంలో కొనసాగుతున్నారు. ఇదిలా ఉండగా ఓ పార్టికి చెందిన సిట్టింగ్ ఎమ్మెల్యేకు టిక్కెట్ లభించకపోతే కాంగ్రెస్ పార్టీ తరుపున చార్మినార్ నుంచి పోటీ చేయటానికి ఆసక్తి చూపుతున్నారని అందుకే చార్మినార్ టిక్కెట్‌ను ఇంత వరకు పార్టీ అధిష్టానం ప్రకటించలేదని కొంత మంది కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు.

## నిరుద్యోగ యువతకు మోదీ ఇచ్చిన హామీ ఏమైంది

### ఎంపి సంతోష్‌కుమార్ డిమాండ్




మహాసభల్లో ప్రసంగిస్తున్న ఎంపి సంతోష్‌కుమార్

సైఫాబాద్, అక్టోబరు 29 ప్రభాతవార్త: ప్రతి ఏడాది రెండు కోట్ల ఉద్యోగాలను భర్తీ చేస్తామని ప్రగల్భాలు పలికిన ప్రధాని నరేంద్రమోదీ పదేళ్ళ బిజెపి పాలనలో ఎన్ని ఉదో ్యగాలు భర్తీ చేశారో చెప్పాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, పార్లమెంట్ సభ్య డు పి.సంతోష్‌కుమార్ డిమాండ్ చేశారు. యువజన, ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న బిజెపి, ఆ పార్టీ బి-టీమ్‌గా వ్యవహరిస్తున్న తెలంగాణ రాష్ట్రంలోని బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని, ఎపిలోని వైఎస్ జగన్‌రెడ్డి ప్రభుత్వాన్ని గద్దె దించాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందని ఆయన స్పష్టం చేశారు. రెండు రోజులపాటు జరిగే ఎఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర ద్వీతీయ మహా సభలు ఆదివారం హిమాయత్‌నగర్‌లోని తేరాఫంత్ హాల్‌లో ప్రారంభమైనాయి. ఈ సందర్భంగా సంతోష్‌కుమార్ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వానికి ప్రజాస్వామ్యం, రాజ్యాంగంపైన గౌరవం, విశ్వాసం లేదని ఆరోపించారు. మణిపూర్‌లో మత ఘర్షణలు కొనసాగుతున్నాయని ఎంతో మంది ఆస్తులను, చివరకు ప్రాణాలను పోగోట్టుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మహాసభలలో ఎఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.తిరుమలై, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర, ప్రముఖ సామాజిక కర్త మోటూరి కృష్ణప్రసాద్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఎస్.బోస్, ఇ.టి.నర్సింహ్మా, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్.చాయాదేవి, సహాయ కార్యదర్శులు స్టాలిన్, కమతం యాదగిరి, ప్రజా నాట్యమండలి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాస్, పల్లె నర్సింహ, ఎఐవైఎఫ్ రాష్ట్ర నాయకులు నిర్లకంటి శ్రీకాంత్, శంకర్, సురేష్, సత్యప్రసాద్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

## రాజకీయ పార్టీలు మేనిఫోస్టోలలో ఉద్యమకారుల సంక్షేమం బోర్డు' ఏర్పాటు అంశాన్ని చేర్చాలి


### తెలంగాణ ఉద్యమకారుల ఫోరం



ప్రసంగిస్తున్న తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్

చిక్కడపల్లి, అక్టోబరు 29 ప్రభాతవార్త: అన్ని రాజకీయ పార్టీలు తమ మేనిఫోస్టోలలో 'తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమం బోర్డు' ఏర్పాటు అంశాన్ని చేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర స్థాయి సమావేశం డిమాండ్ చేసింది. ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఫోరం రాష్ట్ర చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్ అధ్యక్షతన రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులతో పాటు, జిల్లా కమిటీ సభ్యులు, మహిళా ఫోరం నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమావేశంలో పలు తీర్మాణాలను ఆమోదించారు. తెలంగాణ ఉద్యమకారులకు ప్రతి నెల ఫించన్ సౌకర్యం కల్పించడంతో పాటు సంక్షేమ పథకాలలో 20శాతం కోటా కేటాయించాలని, వడ్డీలేని రుణాలు, ఉచిత బస్సు సౌకర్యం, రైల్వే పాసు, ఆరోగ్యకార్డులు ఇచ్చి తెలంగాణ స్వాతంత్ర్యసమరయోధులుగా గుర్తించాలని సూచించింది. సిఎం కెసిఆర్ బిఆర్ఎస్ పార్టీ మేనిఫెస్టోలో తెలంగాణ ఉద్యమకారుల ఊసెత్తకుండా తెలంగాణ ఉద్యమకారులను పూర్తిగా నిర్లక్ష్యం చేయడటాన్ని సమావేశం ఖండించింది. తెలంగాణ ఉద్యమకారులను పూర్తిగా మరిచిపోవడం ఉద్యమ నాయకుడిగా కెసిఆర్‌కు తగదని, ఉద్యమకారుల సహకారంతోనే కెసిఆర్ సిఎం అయ్యారని, కాని నేడు ఉద్యమకారుల ఊసెత్తకుండా మరిచిపోవడాన్ని ఉద్యమకారులు జీర్ణించుకోలేకపోతున్నారని సమావేశం ఆవేదన వ్యక్తం చేసింది. ఈ కార్యక్రమంలో భాగంగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం స్టీరింగ్ కమిటీ ఏర్పాటు అయిందది. చైర్మన్‌గా డాక్టర్ కె.వి.కృష్ణారావు, రాష్ట్ర కన్వీనర్‌గా పటోళ్ల సురేందర్‌రెడ్డి, దక్షిణ తెలంగాణ కన్వీనర్‌గా ఎ.వెంకటేశ్‌గౌడ్, ఉత్తర తెలంగాణ కన్వీనర్‌గా గుండేటి ఐలయ్యయాదవ్, కోచైర్మన్‌గా నారాయణసింగ్, కుమారస్వామి, షేక్ ఛాంద్‌పాషా ఉన్నారు.

## రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన వాక్



కెబిఆర్ వద్ద వాక్‌ను ప్రారంభిస్తున్న విఫర్ ఉమెన్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

హైదరాబాద్, అక్టోబరు 29,ప్రభాతవార్త: ప్రపంచ వ్యాప్తంగా అన్ని రకాల క్యాన్సర్‌కంటే రొమ్ము క్యాన్సర్ కేసులు ఈమధ్యకాలంలో అత్యధికంగా నమోదవుతున్నాయని గాంధీ ఆసుపత్రి అసోసియేట్ ప్రొఫెసర్ విఫర్ ఉమెన్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులరాలు డాక్టర్ ప్రతిభ లక్ష్మీ తెలిపారు. రొమ్ముక్యాన్సర్‌పై మహిళలలో అవగాహన కల్పించేందుకు అక్టోబర్ నెల రొమ్ము క్యాన్సర్ అవగాహన నెలగా ప్రకటించడంతో కెబిఆర్ పార్కువద్ద 2కెవాక్‌ను నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎన్ఎంజే క్యాన్సర్ ఆసుపత్రి వైద్యులు డా.విశాల్, ప్రభుత్వ వైద్యురాలు అలియాబాద్ మెడికల్ అఫీసర్ డా.అన్నపూర్ణ ,డా.మదన్‌మోహన్, మానసిక వైద్యులు డా.సంధ్య, సిటీకాలేజ్ నుంచి డా.సుదక్షన, బేగంపేట్ ప్రభుత్వ కాలేజీ నుంచి డా,మాధురి, సంస్థ సభ్యులు విజయలక్ష్మీ, సురేష్, అభిరాం, జయరాం పాల్గొన్నారు.

## ఎప్పటి సమస్యలు అప్పుడే పరిష్కరించాను: మంత్రి తలసాని




కాలనీ వాసులతో జరిగిన ముఖాముఖిలో ప్రసంగిస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

సికింద్రాబాద్, అక్టోబర్ 29 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రం ఎర్పడిన తరువాతనే మినీ ఇండియాగా పిలుచుకునే హైద్రాబాద్ నగరం దేశంలోనే అత్యంత నివాసయోగ్యమైన నగరంగా గుర్తింపును పొందిందని సనత్‌నగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. ఆదివారం బన్సీలాల్‌ఫేట్ డివిజన్‌లోని ముషీరాబాద్ చౌరస్తా వద్ద గల విజయలక్ష్మీ టవర్స్‌లో వివిధ అపార్ట్‌మెంట్ వాసులతో ఏర్పాటు చేసిన ముఖాముఖి కార్యాక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014 తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో హైద్రాబాద్ నగరంలో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలను ఎంతో అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. ఈ కార్యాక్రమంలో కార్పొరేటర్ హేమలత, పద్మారావునగర్ ఇంచార్జి గుర్రం పవన్‌కుమార్ గౌడ్, జయదుర్గా, జయలక్ష్మీ, లక్ష్మీ తదితర అపార్ట్‌మెంట్‌ల అధ్యక్షులు గిరిధర్, దేవేందర్, పద్మజ, డాక్టర్ గాయత్రి, అర్జున్ అవార్డు గ్రహీత శోభ, రామలింగేశ్వరరావు, కృష్ణనగర్ కాలనీ అధ్యక్షుడు అశోక్, పంచశీల్ కాలనీ అధ్యక్షుడు అనిల్, ఎంఐజీ కాలనీ అధ్యక్షుడు వెంకటేష్, వెంకటేషన్ రాజు, శ్రీకాంత్ రెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌లో చేరిన బిజెపి మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షులు



అమరం శ్రీనివాసరెడ్డి దంపతులకు పార్టీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వాని స్తున్న ఎమ్మెల్యే మాధవరం

బేగంపేట అక్టోబరు 29,ప్రభాతవార్త : ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో అభ్యర్థిని ప్రకటించడంలో బీజేపీ అధిష్టానం నిర్ణయం తో తీవ్ర అసంతృప్తి చెందిన బీజేపీ మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడు అమరం శ్రీనివాసరెడ్డి దంపతులు ఆదివారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పార్టీ కండు వాను కప్పి అమరం దంపతులు బీఆర్ఎస్‌లోకి చేర్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ బీజేపీ మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఉన్న అమరం శ్రీనివాసరెడ్డి బేగంపేట డివిజన్ లో పట్టున్న నాయకుడని,ఆయనకు ఎంతో రాజకీయ అనుభవం ఉందని,తాను బేగంపేట శ్యాంలాల్‌లో శ్మశాన వాటిక (మహాపరినిర్వాణ) నిర్మాణ విషయం లోనూ పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరూ సహకరించారని,ఆ సమయంలో అమరం కూడా తన వంతు సహకరిం చారని గుర్తు చేసారు. బీఆర్ఎస్ లో చేరిన వారిలో రాకేష్ (రాజు), దుబాయ్ యాదగిరి, మోహన్, బబ్లూ, కిరణ్, సాయిగౌడ్, నరేష్‌గౌడ్, యువరాజ్, రవి,జగదీష్,చిన్నా తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో బేగంపేట డివిజన్ అధ్యక్షులు పొన్నబోయిన సురేష్ యాదవ్. బీ ఆర్ ఎస్ నాయకులు టి.శ్రీహరి,డి.వి.నరేందర్‌రావు,సి.సత్యనారాయణ,భారీ సంఖ్యలో కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

## నేత్రపర్వం భారతీయ నాట్య కళాసేవా వైభవం

**విశ్రాంత జడ్జి బూర్గుల మధుసూదన్**



కళాకారులు, గురువులను సత్కరిస్తున్న మధుసూదన్ తదితరులు

నాంపల్లి, అక్టోబరు 29 ప్రభాతవార్త : భారతీయ శాస్త్రీయ నాట్య కళాసేవా వైభవాలు నేత్రపర్వంగా మానసిక ఉల్లాసాన్ని, ఉత్తేజాన్ని, ఆరోగ్యాన్ని అందిస్తాయని విశ్రాంత జడ్జి బూర్గుల మధుసూదన్ అన్నారు. కళా సామాజిక సేవాకార్యక్రమాల్లో వంద ప్రపంచ రికార్డులు కైవసం చేసుకున్న ఆర్.కె కళా ఫౌండేషన్ జాతీయస్థాయిలో భారతీయ నాట్య కళాసేవా వైభవం పేరిట పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళామందిరంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డా. రంజిత్‌కుమార్ నిర్వహణలో ఆదివారం ఉదయం లయన్ చిల్లా రాజశేఖరరెడ్డి సభాధ్యక్షతన జరిగిన ప్రతిష్టాత్మక కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జడ్జి మధుసూదన్ విశిష్ట అతిథి ఏపి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్, గౌరవ అతిథులు కె.మంజుల, ప్రవీణ్‌కుమార్, అలీఖాన్, నాట్యగురువులు భవ్యసాయి, భరణిక్రాంతి, డా. రంజిత్‌కుమార్ తదితరులతో కలిసి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు తదితర రాష్ట్రాల నుండి విచ్చేసిన ప్రముఖ కళాకారులు కూచిపూడి, భరతనాట్యం, పేరిణి, ఆంధ్రనాట్యం తదితర శాస్త్రీయ నృత్యప్రదర్శనలతో ఆహుతులైన అశేషప్రేక్షకులకు నేత్రపర్వం కావించిన కళాకారులను, వారి గురువులను ప్రశంసాపత్రాలు, విశిష్ట పురస్కారాలతో ఘనంగా సత్కరించి భారతీయ కళా సాంస్కృతిక వైభవాన్ని దశదిశలా చాటేవిధంగా అద్భుత కళాకారులను తీర్చిదిద్దుతున్న గురువులను అభినందించారు.

## సంక్షేమ పథకాలను గడపగడపకు తీసుకెళ్లాలి: మంత్రి కేటీఆర్

2014లో ఎల్బినగర్ ఎలా ఉండేది... 2023లో ఎలా ఉందో ఓటరు మహాశయులకు వివరించాలని కోరారు. ప్రపంచ నగరాలతో పోటీపడే విధంగా నగరాన్ని విశ్వనగరంగా తీర్చిదిద్దామని అన్నారు. 2014 తర్వాత కోట్లాది రూపాయలతో రోడ్లు, డ్రైనేజీ, పార్కుల అభివృద్ధి, ఫ్లైఓవర్ల నిర్మాణాలు జరిపామన్నారు. కేసీఆర్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కరెంట్, నీటి కొరత లేదన్నారు. పక్కన ఉన్న కర్ణాటక రాష్ట్రంలో ఐదు గంటలు కరెంటు ఇస్తుంటే మన రాష్ట్రంలో 24 గంటల కరెంటు ఇస్తున్నామన్నారు. పని చేసే ప్రభుత్వానికి పట్టం కట్టాలన్నారు. స్థానిక సమస్యలపై అవగాహన ఉన్న నాయకుడికి పట్టం కడితే అభివృద్ధి మరింత వేగవంతం అవుతుందన్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే కష్టాలు, అంధకారం, అభివృద్ధి కుంటుపడుతుందన్నారు. సంవత్సరానికి ఒకసారి ముఖ్యమంత్రిని మార్చే కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడుతుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు ఎగ్గె మల్లేశం, దయానంద్‌గుప్తా, మాజీ కార్పొరేటర్లు సామ తిరుమలరెడ్డి, కొప్పుల విట్టల్‌రెడ్డి, సాగర్‌రెడ్డి, ముద్రబోయిన శ్రీనివాసరావు, పద్మానాయక్, గజ్జల సుష్మమధుసూదన్‌రెడ్డి, సీనియర్ నాయకులు కుంట్లూరు వెంకటేష్‌గౌడ్, గజ్జల మధుసూదన్‌రెడ్డి, డివిజన్ల అధ్యక్షులు చింతల రవికుమార్, కటికరెడ్డి అరవింద్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి ప్రధాతకు అండగా నిలుస్తాం



ఎమ్మెల్యే వివేకానందకు తమ సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్న కాలనీ వాసులు

జీడిమెట్ల, అక్టోబర్ 29, ప్రభాతవార్త: 130 సుభాష్‌నగర్ డివిజన్ ఆనంద్ నగర్ కాలనీ సంక్షేమ సంఘ వారు శనివారం రాత్రి ఏర్పాటు చేసిన సమావే శంలో తమ కాలనీలో నెలకొని ఉన్న సమస్య ల పరిష్కారానికై ఎమ్మెల్యే కెపి వివేకానంద నిరంతరం అందుబాటులో ఉంటూ అడిగిన వెంటనే సమస్య లను పరిష్కరిస్తూ, మౌలిక వసతులు కల్పించి అభివృ ద్ధికి సహకరిస్తు, సంక్షేమ పథకాలను కాలనీ వాసులకు అందిచడానికి కృషి చేస్తున్నందుకు గాను కాలనీ వాసులు అందరం సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నా మని అన్నారు. ఎమ్మెల్యే వివేకానందను ముచ్చటగా మూడోసారి భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని ఏకగ్రీవ తీర్మానం చేశారు. అనంతరం ఎమ్మెల్యే వివేకా నంద చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై అదే కాలనీకి చెందిన 50మంది, బిజెపి, కాంగ్రెస్ పార్టీల నాయకులు, కార్యకర్తలు రాజకుమార్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బి.వెంకట య్య, జి.పవన్, మహిపాల్‌గౌడ్, సిహెచ్ విజయ్ కుమార్, ఏ.రవికుమార్ తదితరులు పార్టీలో చేరారు.

## ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలు సహకరించాలి

**ఎసిపి ఎన్.సుధీర్**

కంటోన్మెంట్, అక్టోబర్ 29 ప్రభాతవార్త: శాసన సభ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలు సహకరించాలని గోపాలపురం ఏసిపి ఎన్.సుధీర్ తెలిపారు. అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అడ్డగుట్ట, లోహియ నగర్, ఈస్ట్ మారేడ్‌పల్లి, టీచర్స్ కాలనీ, రైల్ నిలయం అంబేద్కర్ నగర్, ఆజాద్ చంద్రశేఖర్ నగర్, వడ్డెర బస్తీ, తుకారాంగేట్, మహేంద్రహిల్స్ పరిసర ప్రాంతాల్లో పోలీసలు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఎన్నికల సమయంలో అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ముందస్తు పోలీస్ బందో బస్తుతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిసస్తున్నామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా కార్యక్రమాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తుకారాంగేట్ ఇన్‌స్పెక్టర్ అంబటి అంజనేయులు ఎస్ఐ దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ సామాజిక కార్యకర్త అవార్డు



అవార్డును అందుకున్న డా.రాజు

నిజాంపేట్, అక్టోబర్ 29, ప్రభాతవార్త : ఐటీ టీవి గ్లోబల్ మీడియా అవార్డుల ఉత్సవం శనివారం రాత్రి టీ హబ్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో నిజాంపేట ప్రగతినగర్‌కు చెందిన ప్రముఖ వైద్యులు, సంఘ సేవకులు డాక్టర్ ఎమ్.ఆర్.ఎస్ రాజుకు ఉత్తమ సామాజిక కార్యకర్తగా పురస్కారాన్ని సినీ హీరో సుమన్ చేతుల మీదుగా ప్రధానం చేశారు. సమాజంలోని వివిధ సంస్యల పట్ల సకాలంలో స్పందిస్తూ, అవసరమైన సహాయ సహకారాలందిస్తున్న డా.రాజుకు ఈ అవార్డునివ్వడం ఆనందంగా ఉందని ఐటి టీవీ చైర్మన్, ఎండి రమణ భూపతి, సీఈఓ తోట రామకృష్ణ సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డా.రాజు మీడియాతో మా ట్లాడుతూ అవార్డులు మన బాధ్యతలను గుర్తు చేస్తూ, మరింతగా సమాజ సేవ చేయడానికి ప్రేరేపిస్తాయన్నారు.

## జీవకన్‌కు అవకాశం కల్పించాలి

**కంటోన్మెంట్ కాంగ్రెస్**



సమావేశంలో మాట్లాడుతున్న కంటోన్మెంట్ కాంగ్రెస్ నేతలు

కంటోన్మెంట్, అక్టోబర్ 29 ప్రభాతవార్త: కంటో న్మెంట్‌లో మంచిపట్టున్న కాంగ్రెస్ నేత జీవకన్‌కు టికెట్ ఖరాకు కాకపోవడం బాధకరమని కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఆర్‌డి. నాగేశ్ యాదవ్, ఫాస్టర్ అమితా బచ్చన్‌లు తెలిపారు. ఆదివారం జీవనక్ వర్గానికి చెందిన కాం గ్రెస్ నాయకులు ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తామన్నారు. కంటో న్మెంట్ కాంగ్రెస్ టికెట్ ఆశించి బంగపడ్డ జీవకన్‌కు ఎమ్మెల్సీ కానీ, ఎంపీగా కానీ అవకాశం కల్పించాలని అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు. సర్వే రిపోర్ట్‌లో జీవక న్‌కు అవకాశం ఉన్నప్పటికి వెన్నెలకు ఖరారు చేయ డం సరైంది కాదన్నారు. ఈ అంశంపై అధిష్టా నం పునర్ ఆలోచించాలన్నారు. కాంగ్రెస్ నాయకులు మైఖేల్ అబ్రహం, సల్మాన్ పాల్గొన్నారు.



భారత్ సేవాస్రమ సంఘం ఆధ్వర్యంలో దీపావళి సందర్భంగా పేదలకు చీరలు, దుస్తులు పంపిణీ చేస్తున్న స్వామి వెంకటేశ్వరానంద, జోయ్ కుమార్‌దత్తా

## కంటోన్మెంట్‌లో బిఆర్ఎస్‌ను గెలిపించాలి : లాస్య నందిత



రెజిమెంటల్ బజార్‌లో పాదయాత్ర చేస్తున్న కంటోన్మెంట్ బిఆర్ఎస్ అభ్యర్థి లాస్య తదితరులు

కంటోన్మెంట్, అక్టోబర్ 29 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రంలో సిఎం కేసిఆర్ ప్రవేశపెట్టిన సంక్షే మ పథకాలు దేశంలోనే ఆదర్శంగా నిలిచాయని, ఈ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీని బారీ మెజార్టీతో గెలిపిం చాలని కంటోన్మెంట్ బిఆర్ ఎస్ అభ్యర్థి లాస్య నందిత తెలిపారు. ఆదివారం మోం డా డివిజన్‌లోని రెజిమెంటల్ బజార్, ధర్జీ బస్తీ, చీపురు బస్తీ పరిసర ప్రాంతాలో ల్ల విస్తృతంగా పర్యటించి కారు గుర్తుకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. లాస్య పాదయాత్రకు అపూర్వ స్పందన లభించింది. ఓటర్లు అభ్యర్థి లాస్యను మంగళ హా రతులతో అడుగడుగున స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పోరేటర్ ఆకులరూప, జిహెచ్‌ఎంసి మాజీ కో-ఆప్షన్ సభ్యుడు నరిసింహ్మా ముదిరాజ్, డివిజన్ అధ్యక్షుడు ఆకుల హరిక్రిష్ణ, మాజీ చైర్మన్ టీ.ఎన్.శ్రీనివాసన్, బిఆర్ఎస్ నాయకులు అజయ్, అశోక్, బత్తుల నారాయణ, అమర్, దాసరి కర్ణకుమార్, సత్య నారాయణ, కాశిరెడ్డి, పనస సంతోష్, తేజ్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.

## రాముడి దివ్య చరిత్రను సంపూర్ణ మానవాళికి పరిచయంచేసిన మహనీయుడు వాల్మీకి

**ఆమ్ ఆద్మీపార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ డి.సుధాకర్**

చిక్కడపల్లి, అక్టోబరు 29 ప్రభాతవార్త: మర్యాద పురుషోత్తముడు శ్రీరాముడి దివ్య చరిత్రను సంపూర్ణ మానవాళికి పరిచయంచేసిన ఆదికవి వాల్మీకి మహర్షి అని ఆమ్ ఆద్మీపార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ డి.సుధాకర్ కీర్తించారు. ఆదివారం నగరంలోని బాగ్‌లింగంపల్లి సూర్యానగర్‌లో మహర్షి వాల్మీ జయంతి కార్యక్రమం సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజేందర్‌కుమార్, కె.సురేందర్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ డి.సుధాకర్ మాట్లాడుతూ జగదానందకారకుడు, శరణాగత వత్సలుడు, సకల గుణాభిరాముడు అయిన శ్రీరాముడి దివ్యచరిత్రను, శ్రీరామనామ మాధుర్యాన్ని మనకందించిన కవికోకిల, ఆదికవి వాల్మీకి మహర్షి మానవాళి యావత్తు రుణపడి ఉంటుందని అన్నారు. ధర్మాత్ముడు, కరుణా సింధువు, సకల సద్గుణ సంపన్నుడు, గొప్ప ప్రజ్ఞాశాలి, మేరునగదీరుడు అయిన శ్రీరాముడి దివ్యచరిత్రను కావ్యరూపంలో అందించమని ఆదేశించిన బ్రహ్మదేవుడి ఆజ్ఞమేరకు శ్రీరాముడి కీర్తి పరిమళాలను ముల్లోకాల్లో గుబాళింపచేసిన వాల్మీకి మహర్షి విశేష వృత్తాలతో, అర్థవంతమైన చక్కని పదాలతో, శాస్త్ర అనుకూలమై సమాసాలు, సంధులు, మధురమైన అర్థవంతమైన వాఖ్యాతో కూడిన శ్రీరామాయణ మహాకావ్యాన్ని అందించారన్నారు. ఈకార్యక్రమంలో తిరుపతి యాదయ్య, సంఘం ప్రతినిధులు శ్యామ్‌లాల్ టక్,కరణ్, ఉపాధ్యక్షుడు సుభాష్, అనీల్, సునీల్, కమిటీ సభ్యులు పప్పు, అభిమన్యు, శివ, వికాస్, ప్రీతమ్, సాహిల్ తదితరులు పాల్గొన్నారు.

## రాజేంద్రనగర్‌ను "హస్త"గతం చేసుకొని తీరుతాం

**రాజేంద్రనగర్ కాంగ్రెస్ అభ్యర్థి కస్తూరి నరేందర్ ముదిరాజ్**

నార్సింగి, అక్టోబర్ 29 ప్రభాతవార్త : కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలమంతా సమిష్టిగా కష్టపడి ఈ దఫా రాజేంద్రనగర్ నియోజకవర్గంను "హస్త"గతం చేసుకొని తీరుతామని కాంగ్రెస్ అభ్యర్థి కస్తూరి నరేందర్ ముదిరాజ్ ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం మణికొండలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేఖ విధానాలే ఈ దఫా కాంగ్రెస్ పార్టీ విజయానికి సోపానాలుగా మారాయన్నారు. నియంతృత్వ, దొరల పాలనతో రాష్ట్ర ప్రజలంతా విసుగు చెందారని, ఆది నుంచి అట్టడుగు వర్గాలకు అండగా నిలుస్తున్న కాంగ్రెస్‌వైపు ఆశగా ఎదిరి చూస్తున్నారని తెలిపారు. నాకు ఎన్నికల బరిలో దిగడం,విజయం సాధించడం గత మూడున్నర దశాబ్దాలుగా అలవాటుగా మారిందని, ఎమ్మెల్యేగా తొలిసారి అవకాశం వచ్చిందని, ఈ సారి సైతం గెలిచి చూపిస్తానని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ సాంప్రదాయ ఓట్లు, ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు, ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన ఓట్లు గంపగుత్తగా సాధించి గెలిచి చూపిస్తానని స్పష్టం చేశారు. సీనియర్ కాంగ్రెస్ నాయకుల సలహాలు, సూచనలు తీసుకొని ముందుకెళ్తున్నామన్నారు. బిఆర్ఎస్ పార్టీలోని చాలా మంది సీనియర్ నేతలు, ప్రజా ప్రతినిధులు నాకు టచ్‌లోకి వచ్చారని ప్రణాలికబద్ధంగా ప్రచారం చేసి కాంగ్రెస్ పార్టీ అధిష్టానంకు తొలి గెలుపు రుచి రాజేంద్రనగర్ నుంచే అందిస్తానని కస్తూరి నరేందర్ ముదిరాజ్ వివరించారు.

## సంక్షేమం అంటేనే బిఆర్ఎస్ : మ్మెల్యే వివేకానంద

పేట్‌బషీరాబాద్, అక్టోబర్ 29, ప్రభాతవార్త : సంక్షేమం అంటేనే బిఆర్ఎస్ ప్రభుత్వమని ఎమ్మెల్యే కెపి వివేకానంద అన్నారు. ఆదివారం సూరారం డివిజన్ జై భీం నగర్ 60గజాలకు చెందిన 50మంది యువకులు ఎమ్మెల్యే నివాసం వద్ద ఎం. శ్రీనివాస్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. వీరిని ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కుత్బుల్లాపూర్‌లో జరిగే అభివృద్ధిలో యువకులు, మహిళలు భాగస్వాములు కావాలన్నారు. నర్సింహ, సతీస్, రమణ, కుమార్, అనిల్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ రాజశేఖర్, బాల కృష్ణ, పవన్‌కుమార్, సుబ్బారావు, రత్నం, రవి, కె.శ్రీను, ఎల్లయ్య, వెంకటేష్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కంటోన్మెంట్‌లో బిఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలి

**వర్రి తులసీరామ్**

కంటోన్మెంట్,అక్టోబర్ 29 ప్రభాతవార్త: కంటోన్మెంట్ నియోజకవర్గంలో బిజెపి అభ్యర్థిని గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ రాష్ట్ర నాయకులు వర్రి తులసీ రామ్ విజయ్ కుమార్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం 6వ వార్డులోని నందమూరి నగర్‌లో ఇంటింటికి తిరుగు తూ బిజెపి అభ్యర్థిని గెలిపించాలని ప్రచారం నిర్వహిం చారు.ఈ కార్యక్రమంలో 6వ వార్డు బిజెపి అధ్యక్షులు బి.అజయ్ కుమార్, బానుక మల్లికార్జున్, నాయకులు ప్రతీక్ జైన్, నరేందర్,సంతోష్ రెడ్డి, సాయిప్రసాద్, శ్రీకాంత్, దశరాత్ రెడ్డి, కిషోర్ యాదవ్ పాల్గొన్నారు.

## ప్రగతి నగర్‌లో మంచినీటి సమస్యను పరిష్కరించాలి : బిజెపి

నిజాంపేట్, అక్టోబర్ 29, ప్రభాతవార్త : నిజాంపేట్ కార్పోరేషన్ పరిధిలో ప్రజలు పెరిగినట్టుగా కార్పోరేషన్ అవసరాలకి అనుకూలంగా త్రాగునీటి సప్లై (90ఎంఎల్డీ)ని గత పది సంవత్సరాలుగా బిఆర్ఎస్ ప్రభుత్వం 30-40 ఎంఎల్‌డి త్రాగునీర్‌కి పెంచలేకపోయిందని, అదేవిధంగా రోజు విడిచి రోజు కూడా మంచినీరు ప్రగతినగర్ పౌరులకు అందించకపోవడం, ప్రగతి నగర్ ప్రజలు చెలి చిన 69లక్షల వాటర్ బిల్‌ని తక్షణమే వాటర్ వర్క్ అధికారులకి మున్సిపల్ అధికారులు చెల్లించాలని, చెల్లించకపోవడం వల్ల అపరాధ రుసుము పడుతుం దని, ఆ నెంబర్ సమస్యను పరిష్కరించకపోవడం, అదేవిధంగా మోటార్స్‌ని తక్షణమే రిపేర్ చేయించాలని, అవసరమైతే అదనంగా రిజర్వ్ మోటార్లను కొనాలని, గత వారం రోజులుగా ప్రగతి నగర్ పౌరులకు మంచినీటి సప్లై నిల్చుకోవడంతో ప్రజల కోరిక మేరకు వాటర్‌సంపు వద్దకు వెళ్లి పరిశీలించగా వాటర్ మాత్రం ట్యాంకర్ల ద్వారా అమ్ముకోవడానికి వీలవుతుంది కానీ ప్రజలకు మంచినీళ్ళు సప్లై చేయడానికి ఎందుకు వీలవుతలేదని అధికారులను నిలదీసిన బిజెపి నాయకులు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఇంటలిజోల్ ఫోరం కన్వీనర్ ప్రొఫెసర్ చంద్రమౌళి, నిజాంపేట్ కార్పోరేషన్ ఉపాధ్యక్షులు సత్యనారాయణ, ప్రతాప్, ప్రగతినగర్ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## దంతులూరి వెంకాయమ్మ నూరు వసంతాల వేడుకలు

జీడిమెట్ల, అక్టోబర్ 29, ప్రభాతవార్త : దంతులూరి వెంకాయమ్మ 29.10.1923 సంవత్సరంలో మంతెన పెదరామరాజు సుందరమ్మ మొదటి సంతానంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పశ్చిమ గోదావరి జిల్లా, కాళ్ళ మండలం, కలువపూడి గ్రామంలో జన్మించారు. వీరికి 1940వ సంవత్సరంలో తూర్పు గోదావరి జిల్లా, రాజోలు మండలం, చింతలపల్లి పంచాయతీ పోతుమట్ల గ్రామంలో దంతులూరి వెంకట రాఘవరాజు రాజమ్మల మొదటి సంతా నమైన సోమరాజుకు ఇచ్చి వివాహం జరిపించారు. వీరి సంతానం పెదరా మరాజు, ప్రభావతిదేవి, సత్యనారా యణరాజు, అమ్మాజీ, సుందరం, రంగమణి, విష్ణుమూర్తిరాజు, శ్రీనివాసరాజు, సావిత్రి, శివాజీరాజు, నాగినిదేవి, తాతరాజులు పన్నెండు మందికి జన్మనిచ్చారు. కాగా 29.10.2023 నాటికి దంతులూరి వెంకాయమ్మకు 100 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా మనవలు, మునిమనవరాలు, ఎనిమనవలు సుమారు 5 తరాల వారందరూ 200మంది కలిసి నూరు వసంతాల మహోత్సవాన్ని వైభవంగా చేయాలని సంకల్పించారు.

## కూకట్‌పల్లిలో నేను కాదు.. మేము గెలుస్తున్నాం

**కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి బండి రమేశ్**



సమావేశంలో మాట్లాడుతున్న బండి రమేశ్

మూసాపేట, అక్టోబర్ 29, ప్రభాతవార్త : కూకట్‌పల్లిలో కాంగ్రెస్ పార్టీని కార్యకర్తలం అందరం కలిసి ఖచ్చితంగా గెలిపించుకుని తీరుతామని కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బండి రమేశ్ పేర్కొన్నారు. ఆదివారం కైతలాపూర్‌లో ఏర్పాటు చేసిన పార్టీ ముఖ్య కార్యకర్తలతో కలిసి విలేకర్ల సమావేశంలో ప్రసంగిచడం జరిగింది. ఈ సందర్భంగా బండి రమేశ్ మాట్లాడుతూ నన్ను కూకట్‌పల్లికి పార్టీ అభ్యర్థిగా నిలబెట్టినందుకు రాహుల్ గాంధీకి, మల్లిఖార్జున ఖర్గెకు తెలంగాణ పిసిసి ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. నేను ఇక్కడికి రావడం గతం నుండి పనిచేసిన కాంగ్రెస్ నాయకులకు బాధాకరమైనప్పటికీ గెలుపే లక్ష్యంగా, నాకు రాజకీయా లలో ఉన్న సుదీర్ఘ అనుభవం కూకట్‌పల్లి ప్రజలతో ఉన్న పాత అనుబంధం దృష్టిలో పెట్టుకుని సర్వే ఫలితాల ఆధారంగా కేటాయించడం జరిగిందన్నారు.

**ఇక్కడ జరుగుతున్న అరాచకం తెలుసు..** ఇక్కడ బిఆర్ఎస్ పార్టీ నాయకుడి వలన కాంగ్రెస్ కార్యకర్తలపై అన్యా యంగా కేసులు అయిన విషయంలో పాటు అక్రమ కట్టడాలు, చెరువుల కబ్జాల విషయంపై తమ్ముడు శ్రీరంగ ద్వార మొత్తం అవగాహన కలిగి ఉన్నానని తెలియజే శారు. అంతేకాక ముఖ్యమంత్రి ప్రతిరోజు చెప్పే అబద్దా లపై నాతో పాటు రాష్ట్ర ప్రజలందరికీ తెలుసని అన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన 6వాగ్దానాలను కాపీకొట్టి మాట్లాడుతున్న ముఖ్యమంత్రి గ్యాసు ధరలని గతంలో ఎందుకు తగ్గించలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అర్హత గల విలేకర్లందరికీ నివాస గృహాలు కట్టించి జర్న లిస్ట్‌ల సొంత ఇంటి కల నెరవేర్చుతామని తెలియజేశారు.

## టిటిడి లోకల్ అడ్వాయిజరీ కమిటీ అధ్యక్షుడిగా రవిప్రసాద్



రవిప్రసాద్‌కు నియాకమపత్రం అందిస్తున్న చైర్మన్ కరుణాకర్‌రెడ్డి, ఎంపి సంతోష్ తదితరులు

హైదరాబాద్, అక్టోబరు 29,ప్రభాతవార్త: సనాతన ధర్మపరిరక్షణకు, వేద సంప్రదాయాలు కాపాడేందుకు, ప్రాచీన విలువను కాపాడేందుకు టిటిడి పాలకమండలి కట్టుబడి పనిచేస్తుందని టిటిడి బోర్డు చైర్మన్ కరుణాకర్‌రెడ్డి అన్నారు. ఈమేరకు ఆదివారం జూబ్లీహిల్స్ టిటిడి లోకల్ అడ్వజరీ కమిటీ అధ్యక్షుడిగా ఎలిశాల రవి ప్రసాద్ ప్రమణస్వీకారోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి టిటిడి చైర్మన్‌తోపాటు ఎంపి జోగినిపల్లి సంతోష్, మాజీ డిజిపి మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా చైర్మన్ కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రధాన నగరాల్లో ఆలయాలకు లోకల్ అడ్వయిజరీ కమిటీలను వేసి ఆల యాలను అభివృద్ధి పథంలో నడిపించేలా కృషి చేస్తామ న్నారు. గడిచిన నాలుగేళ్లలో టిటిడి శ్రీవాణి ట్రస్ట్ ద్వారా సుమారు 2500లకుపైగా ఆలయాలను నిర్మించడంతో పాటు కొన్నింటిని పునర్నిర్మించామని అన్నారు. వేద సంస్కృతిని కాపాడటంతోపాటు వేద విద్యార్థుల ఆర్థిక స్థితిగతులు బాగుపడేలా ఎప్పటికప్పుడు టిటిడి అనుబంధ విశ్వవిద్యాలయాలు కృషి చేస్తున్నాయని అన్నారు. ప్రజల్లో ఆధ్యాత్మిక చైతన్యం తీసుకువచ్చేందుకు టిటిడి ఆధ్వర్యంలో హిందూ ధర్మప్రచార పరిషత్ ద్వారా నిత్యం ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని రానున్న రోజుల్లో వాటిని మరింతగా పెంచుతామని అన్నారు. ఈకార్యక్ర మంలో టిటిడి బోర్డు సభ్యులు గడ్డం సీతారెడ్డి, నాగ సత్యం, సుబ్బరాజు, హిమాయత్‌నగర్ టిటిడి ఎల్‌ఏసీ ప్రెసిడెంట్ ప్రసాద్, ఐఎఎస్ అధికారులు అమయ్‌కుమార్, హరీష్ నాయక్, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పిజెఆర్ కుటుంబానికే అన్యాయం చేసిన కాంగ్రెస్

**విష్ణు లాంటి నేతలకే టికెట్ నిరాకరిస్తారా**

**జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి**

ఫిల్మ్‌నగర్, అక్టోబర్ 29, ప్రభాతవార్త : పారాష్యూట్ నేతలకు టికెట్ ఇవ్వమని చెప్పి ఉత్తర ప్రగల్భాలు పలి కిన రాహుల్ గాంధీ ఇప్పుడు జూబ్లీహిల్స్ టికెట్ ఎవరికి ఇచ్చారని బిఆర్ఎస్ జూబ్లీహిల్స్ నియోజకవర్గం అభ్యర్థి, ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ ప్రశ్నించారు. నెల రోజుల క్రితం క్షేత్రస్థాయిలో పనిచేసిన వారికే టికెట్లు ఇస్తామని, పారాషూట్ నేతలకు టికెట్‌లు ఇవ్వమని చెప్పిన రాహుల్ గాంధీ మాటలు ఉత్తర ప్రగల్భాలేనా అని నిలదీశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఇన్చార్జిగా నియమితులైన కట్టెల శ్రీనివాస్‌యాదవ్ జూబ్లీహిల్స్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యేను కలిసిన సందర్భంగా ఏర్పా టు చేసిన విలేకరుల సమావేశంలో మాగంటి గోపినాథ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీలో పేరు ప్రఖ్యాతలుగాంచిన దివంగత పి.జనార్థ న్‌రెడ్డి లాంటి పెద్ద నాయకుని తన యునికే టికెట్ ఇవ్వలేదంటే ఆ కుటుం బానికి అన్యాయం చేసినట్లు కదా అని మాగంటి వ్యాఖ్యానించారు. మంచికో చెడుకో కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టత కోసం పని చేసిన నిజమైన కార్యకర్త, రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన పి. విష్ణువర్ధన్‌రెడ్డి లాంటి నాయకునికే టికెట్టు రాకపోవడం ఆశ్చర్యానికి గురిచే సిందని మాగంటి అన్నారు. నెల రోజు ల క్రితం వచ్చిన పారాషూట్ నాయకు నికి జూబ్లీహిల్స్ కాంగ్రెస్ టికెట్ ఇవ్వ డం ఆ పార్టీకే చెల్లిందని మాగంటి వ్యాఖ్యానించారు.


## కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని రాజకీయ పార్టీలు ఎన్నికల మ్యానిఫెస్టోలో చేర్చాలి

**ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.వెంకటేశం**

సైఫాబాద్, అక్టోబరు 29 ప్రభాతవార్త: రవాణా కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేస్తామని హామీ ఇస్తూ అన్ని రాజకీయ పార్టీలు తమ, తమ ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపరచాలని ఎఐటియుసి ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.వెంకటేశం డిమాండ్ చేశారు. ఆదివారం హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్ ఎదుట కైరతాబాద్ నియోజకవర్గంలోని బిఆర్ఎస్‌కెవి ఆటో యూనియన్‌కు చెందిన వంద మంది ఆటో డ్రైవర్లు బి.వెంకటేశం, ఎఐటియుసి ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్ హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి సి.హెచ్.జంగయ్య, గౌరవ అధ్యక్షుడు బ.బిక్షపతియాదవ్ సమక్షంలో ఎఐటియుసి యూనియన్‌లో చేరారు. ఈ సందర్భంగా వెంకటేశం వారికి కండువాలు కప్పి యూనియన్‌లోకి సాదరంగా ఆహ్వానించారు. వెంకటేశం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు ఆటో మీటర్ చార్జీలు రాష్ట్ర ప్రభుత్వం పెంచకుండా ఆటో, క్యాబ్ డ్రైవర్లను మోసం చేసిందని ఆరోపించారు. గత పది సంవత్సరాలుగా నిరంతరంగా ఇంధనం చార్జీలు పెంచుతున్న కేంద్రం రవాణా రంగ డ్రైవర్లను నిలువు దోపిడీ చేస్తున్నదని ధ్వజమెత్తారు. రవాణా రంగా కార్మికుల సంక్షేమం కోసం తమ యూనియన్ అనేక ఆం దోళన చేపట్టినా, వినతి పత్రాలు సమర్పించినా పట్టించుకోలేదని, సిఎం కెసిఆర్ పూర్తిగా నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. తమ డిమాండ్లపై ఎన్నికల మ్యానిఫెస్టోలో హామీలు పొందుపరిచిన పార్టీలకు మాత్రమే డ్రైవర్లు ఓట్లు వేయాలని, లేని పక్షంలో తగిన బుద్ధి చెప్పాలని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు అబ్దుల్‌ఘని, భాస్కర్, ఖలేదా, కృష్ణమూర్తి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రకాశ్‌గౌడ్ గెలుపు కోసం సైనికుల్లా పని చేద్దాం

**మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్**



బైరాగిగూడలో బిఆర్ఎస్ అభ్యర్థి ప్రకాశ్‌గౌడ్‌కు ఓట్లు వేయాలని ప్రచారం చేస్తున్న బండ్లగూడ కార్పోరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్

నార్సింగి, అక్టోబర్ 29 ప్రభాతవార్త : రాజేంద్రనగర్ బిఆర్ఎస్ అభ్యర్థి ప్రకాశ్‌గౌడ్ గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలంతా సైనికుల్లా చేయాలని బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్, డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డిలు పేర్కొన్నారు. ఆదివారం కార్పోరేషన్ పరిధిలోని ఒకటో వార్డులో కార్పోరేటర్ తలారి చంద్రశేఖర్, అధ్యక్షులు గోకరి సురేష్‌గౌడ్ సీనియర్ నాయకులతో కలిసి మేయర్, డిప్యూటీ మేయర్లు జోరుగా ప్రచారం నిర్వహించారు. గడప గడపకు వెళ్లి తొమ్మిదిన్నరేళ్లలో బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన సంక్షేమాభివృద్ధి ఫలాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నాయకత్వంలో ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ రాజేంద్రనగర్ నియోజకవర్గంను రాజధాని హైదరాబాద్‌కు ధీటుగా అభివృద్ధి చేశారని తెలిపారు. నిరంతరం నిరుపేదల అభ్యున్నతి కోసం పరితపించే నాయకుడు కావడం వల్లనే ఈ ప్రాంత ప్రజలు వరుసగా మూడుమార్లు గెలిపించుకున్నారని, ఈ దఫా కూడా ప్రకాశ్‌గౌడ్‌నే గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిదన్నా రు. పని చేసే వారికి పట్టం కడితేనే మన సమస్యలు పరిష్కార మవుతాయని, అభివృద్ధి వేగంగా జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ రాందాస్ ముదిరాజ్, కార్పోరేటర్లు సంతోషి రాజిరెడ్డి, రవీందర్‌రెడ్డి, అస్లాం, సాగర్‌గౌడ్, నాయకులు పాపయ్య యాదవ్, నాగరాజు, గోపాల్, పాండు, ఖాజా, అంతారం నరేష్, రాజు, రాంప్రసాద్, రాము, మల్లేష్ యాదవ్, సుందర్‌గౌడ్, సంపత్, దశరథ్, సదానంద్‌గౌడ్, నదీం, సదానంద్, సాధిక్ తదితరులు పాల్గొన్నారు.

# టౌన్‌ప్లానింగ్‌లో ఏసీబీ గుబులు

## మారని తీరు... ప్రదర్శిస్తున్న చేతివాటం..

### ఏసీబీకి పట్టుబడ్డ కొద్దిరోజులకే స్థానికంగా విధులు

**ఎల్.బి.నగర్, అక్టోబర్ 29 ప్రభాతవార్త:** గత అనుభవాలను మరిచి టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది తమ చేతివాటన్ని ప్రదర్శిస్తూనే ఉన్నారు. ఏసీబీ అధికారుల దాడిలో పలుమార్లు పట్టుబడినప్పటికీ లంచావతారాలు మాత్రం తమ పద్ధతిని మార్చుకోవడం లేదు. ఏసీబీకి పట్టుబడ్డ వారు కొంతకాలం వేరే ప్రాంతంలో విధులు నిర్వహించి తిరిగి ఇక్కడికే వస్తున్నారు. దీంతో తమకు ఎదురే లేదు అన్నట్లు కొందరు అధికారులు, సిబ్బంది వ్యవహరిస్తున్న తీరు పలు విమర్శలకు దారితీస్తోంది. హయాత్‌నగర్, సరూర్ నగర్, ఎల్బీనగర్ సర్కిల్ పరిధిలో గతంలో జరిగిన ఏసీబీ దాడులలో పలువురు అధికారులు సిబ్బంది పట్టుపడ్డారు. అయినప్పటికీ చేతివాటాన్ని మాత్రం ప్రదర్శిస్తూనే ఉన్నారు. ఈ నెల 19వ తేదీన హయత్‌నగర్ టౌన్‌ప్లానింగ్ ఏసీపీ ఉమా, ఫైన్ మ్యాన్ లక్ష్మణ్ గుర్రంగూడాకు చెందిన సుధాకర్‌రెడ్డి వద్ద రూ.1.50లక్షలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇంటి నిర్మాణానికి సంబంధించి దరఖాస్తు చేసుకోవడమే ఆలస్యం వారి వద్ద నుంచి టౌన్‌ప్లానింగ్ అధికారులు సిబ్బంది పెద్దఎత్తున లంచం డిమాండ్ చేస్తున్నారు. ఈ మూడు సర్కిళ్ల పరిధిలో ఈ తంతు చాలా సంవత్సరాలుగా కొనసాగుతూనే ఉంది. ఈ విషయమై జిహెచ్ఎంసి ఉన్నతాధికారులకు ఎన్ని ఫిర్యాదులు చేసినా పట్టించుకోకపోవడంతో పలువురు బాధితులు ఏసీబీని ఆశ్రయిస్తున్నారు. ఏసీబీ అధికారులు పక్కా ప్రాణాలకుతో అవినీతి అధికారులను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుంటున్నారు. ప్రతి సంవత్సరం ఏసీబీకి టౌన్‌ప్లానింగ్, అధికారులు సిబ్బంది పట్టుబడుతున్నప్పటికీ లంచవతారాలు తమ పద్ధతిని మార్చుకోకపోవడం పట్ల పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి. టౌన్‌ప్లానింగ్ విభాగంలో గతంలో ఏసీబీకి పట్టుబడ్డ వారు కొంతకాలం వేరే ప్రాంతంలో పనిచేసి తిరిగి ఇక్కడికే వచ్చి విధులు నిర్వహించడం పలు విమర్శలకు దారితీస్తోంది. జిహెచ్ఎంసి ఉన్నతాధికారుల అలసత్వం కారణంగానే టౌన్‌ప్లానింగ్ విభాగంలో లంచవతారాలు విచ్చలవిడిగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

## ప్రజా సేవకే నా జీవితం అంకితం.. మర్రి



తిరుమలనగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న మర్రి రాజశేఖర్‌రెడ్డి

**నేరేడ్‌మెట్, అక్టోబర్ 29 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న సంక్షేమ పథకాలే పార్టీకి బలమని, పార్టీ గెలుపు దిశగా ప్రతి నాయకుడు, కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని మల్కాజిగిరి నియోజకవర్గ బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వినాయక్‌నగర్ డివిజన్ తిరుమలగార్డెన్‌లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ సిఎం కేసీఆర్ నేతృత్వంలో అభివృద్ధి కార్యక్రమాలు, పలు సంక్షేమ పథకాలు చేపట్టడం జరిగిందన్నారు. సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక ప్రతిపక్ష పార్టీలు తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయని వాటిని సమర్ధవంతంగా తిప్పికొట్టాలన్నారు. మల్కాజిగిరిలో బిఆర్ఎస్‌కు ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మల్కాజిగిరి సర్కిల్ ఎన్నికల ఇన్‌చార్జి జితేందర్ రెడ్డి, మురుగేష్, జగదీష్‌గౌడ్, జెఏసి వెంకన్న, నర్సింగ్‌రావు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ డివిజన్ శాంతినగర్‌లో కార్పొరేటర్ రజితరెడ్డి ప్రచారం

**ఉప్పల్, అక్టోబరు 29 ప్రభాతవార్త :** ఉప్పల్ డివిజన్ పరిధిలోని శాంతినగర్, సత్యనగర్‌లో శనివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గడప, గడపకు కాంగ్రెస్ పార్టీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప్పల్‌డివిజన్ పరిధిలోని శాంతినగర్, సత్యనగర్ తదితర ప్రాంతాల్లో స్థానిక కార్పొరేటర్ ఎం.రజితరెడ్డి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ అభ్యర్థి ఎం.పరమేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని ఆమె కోరారు. కాంగ్రెస్ ఇచ్చిన 6గ్యారంటీలపై ఇంటింటికి ప్రచారం చేస్తున్నామని తెలిపారు. పిసిసిచీఫ్ రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు అన్ని ప్రాంతాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నామని తెలిపారు. ఉప్పల్‌లో కాంగ్రెస్ విజయం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో బాకారం లక్ష్మణ్, బోరంపేట కృష్ణ, జనగాం రామస్వామి, ఈగ అంజయ్య, లింగంపల్లి రామకృష్ణ, బి.రఘునాద్‌రెడ్డి, తుమ్మల దేవిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, గోరిగె మహేష్, సుధాకర్, భాస్కర్, రవీందర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, అంజిరెడ్డి, మహిళానేతలు సుశీల, అనిత, అర్చన తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి : కార్పొరేటర్ అరుణ



కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ అరుణ తదితరులు

**మలక్‌పేట, అక్టోబరు 29 ప్రభాతవార్త:** ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగ చేసుకోవాలని సైదబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఎల్‌సిహెచ్‌కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శ్రీ నేత్రాలయ ఐ ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహించిన ఈ శిబిరాన్ని కార్పొరేటర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తరచుగా కంటి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘం అధ్యక్షుడ ఎంవి.బ్రహ్మం, ప్రధానకార్యదర్శి సూర్యం, ఉపాధ్యక్షుడు కిరణ్‌కుమార్, సలహాదారుడు చెప్పల వెంకటేషం, ఆసుపత్రి వైద్య బృందం ఆకాంక్ష, రాము తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయి : మలక్‌పేట నియోజకవర్గ కాంగ్రెస్‌అభ్యర్థి షేక్ అక్బర్



షేక్ అక్బర్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**మలక్‌పేట, అక్టోబరు 29 ప్రభాతవార్త:** ఆరు గ్యారెంటీ పథకాలతో బిఆర్ఎస్ ప్రబుత్వాన్ని రానున్న ఎన్నికల్లో కూకటివేళ్లతో పెకిలిస్తామని మలక్‌పేట్ కాంగ్రెస్ అభ్యర్థి షేక్ అక్బర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అవినీతి, బంధుప్రీతి, ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న బిఆర్ఎస్ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని ఆయన పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో నియోజకవర్గం కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం కాంగ్రెస్ టిపిసిసి ప్రధాన కార్యదర్శి బొల్లు కిషన్, నాయకులు కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి, బాబు శ్రీనివాస్, మదన్‌బాబు, జఫర్, ఇక్బాల్, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణ అక్బర్‌ను సన్మానించారు.

## పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీలో బీఆర్ఎస్‌కు భారీ షాక్... కాంగ్రెస్‌లోకి సిద్ధంకి కృష్ణారెడ్డి



కృష్ణారెడ్డికి కాంగ్రెస్ కండువా కప్పుతున్న వంశీచంద్‌రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి



బిఆర్ఎస్ నేత గంటా శ్రీనివాస్‌రెడ్డి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మల్‌రెడ్డి రంగారెడ్డి

**హయత్‌నగర్, అక్టోబరు 29 ప్రభాతవార్త:** ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు పెద్దషాక్ తగిలింది. పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ కమిటీ అధ్యక్షుడు, మంచిరెడ్డి కిషన్‌రెడ్డికి ప్రధాన అనుచరుడిగా ఉన్న సిద్ధంకి కృష్ణారెడ్డి తన అనుచర వర్గంతో మల్‌రెడ్డి రంగారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎన్నికల వేళ పార్టీని వీడడంతో చర్చానీయంగా మారింది. కృష్ణారెడ్డి విదేయత కారణంగా ఎమ్మెల్యే ఆయనకు పార్టీ మున్సిపాలిటీ బాధ్యతలను అప్పగించారు. అయితే ఇటీవల ఎమ్మెల్యే తమపట్ల వ్యవహరిస్తున్న తీరుపై కృష్ణారెడ్డివర్గీయులు నిరాశతో ఉన్నట్లు సమాచారం. ఉన్నత స్థాయిలో ఉన్నవారికి మాత్రమే అందుబాటులో ఉంటూ వారికే ఎమ్మెల్యే పనులు చేసిపెడుతున్నారని వారు ఆగ్రహంతో ఉన్నారు. ఈక్రమంలో కృష్ణారెడ్డితో పాటు సింగిల్ విండో డైరెక్టర్ గంట శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ నాయకులు బాలరాజుగౌడ్, బుయ్య శ్రీకాంత్, పాలడుగు నాగార్జున కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి సీడబ్ల్యూసీ సభ్యుడు, ఏఐసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ చల్ల వంశీచందర్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వంశీచందర్‌రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగురవేయడానికి నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ మున్సిపాలిటీ కమిటీ అధ్యక్షుడు కొత్తపల్లి జైపాల్‌రెడ్డి, కౌన్సిలర్లు చల్లూరి మురళీధర్‌రెడ్డి, పసుల రాజేందర్, నాయకులు పందుగుల రాజు, బుయ్యకృష్ణ, దండెం రాజశేఖర్ రెడ్డి, కొండల్‌గౌడ్, శ్రీరాములు పాల్గొన్నారు.

## అయ్యప్పనామ సప్తాహన్ని విజయవంతం చేయండి



కమలానగర్ లో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న దృశ్యం.

**కుషాయిగూడ, అక్టోబర్ 29 ప్రభాతవార్త :** నవంబర్లో జరిగే అయ్యప్ప సప్తహ కార్యక్రమాన్ని విజయవంతంచేయడానికి గురుస్వాములు అందరూ అయ్యప్ప స్వాములు తరలిరావాలని అయ్యప్ప ఐక్య సేవాది సంస్థ అధ్యక్షులు వాటి భాస్కర్ గురుస్వామి నవంబర్ 22నుండి 28వరకు జరిగే అయ్యప్ప నామ సప్తాహ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కమలానగర్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయ్యప్ప నామస్మరణతో లోక కళ్యాణం సిద్ధిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తత్వమసి అధ్యక్షులు మురళీకృష్ణ, అయ్యప్ప మకర సంధ్యా సంపాదకులు షరన్‌దాస్, కొంపల్లి కృష్ణమూర్తి, మోహనరావు, రాంచందర్, నందపాల్, నాగేంద్రప్రసాద్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో బిజెపిదే విజయం : వీరేందర్‌బాబు



సమావేశంలో మాట్లాడుతున్న వీరేందర్‌బాబు తదితరులు

**సైదాబాద్, అక్టోబరు 29 ప్రభాతవార్త:** రానున్న ఎన్నికల్లో బిజెపిదే విజయమని బిజెపి అధికార ప్రతినిధి, యాకుత్‌పుర నియోజకవర్గం బిజెపి అభ్యర్థి వీరేందర్‌బాబు అన్నారు. కుర్మగూడ డివిజన్ నాయకులతో సమావేశమైన అనంతరం ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ నియంతృత్వ పాలనతో ప్రజలు విసిగిపోయి ఉన్నారన్నారు. తెలంగాణాలో బిజెపి భారీ మెజార్టీతో అధికారంలోకి రానుందన్నారు. యాకుత్‌పురలో బిజెపి విజయకేతనం ఎగుర వేస్తుందన్నారు. దేశ ప్రజలంతా నరేంద్రమోడి వైపు చూస్తున్నారని అన్నారు.

## బిఆర్ఎస్‌లో బాలాజీనగర్ వాసుల చేరిక

**సరూర్‌నగర్, అక్టోబర్ 29 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని మల్లాపూర్ బాలాజీనగర్‌కు చెందిన పలువురు ఆదివారం బిఆర్ఎస్‌లో చేరారు. ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి సబితా ఇంద్రారెడ్డి, యువ నాయకుడు కార్తీక్‌రెడ్డిల సమక్షంలో కాట్రావత్ నర్సింవు, నర్సింగ్‌గౌడ్, తెలంగాణ వడ్డెర సంఘం అధ్యక్షుడు మంజాల నాగేశ్, బాణావత్ మోతిలాల్, అంగోజి శ్రీను, లక్ష్మణ్, శంకర్, కిరణ్‌లతో పాటు పలువురు బిఆర్ఎస్ గూటికి చేరారు. ఈ సందర్భంగా మంత్రి వారికి గులాబి కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బొర్ర జగన్‌రెడ్డి, ఎస్‌కె ఖలీల్ పాష, దండు గణేష్ ముదిరాజ్, పోరెడ్డి వెంకట్‌రెడ్డి, బొర్ర మాధవరెడ్డి, బాలు నాయక్‌లతో పాటు రామిడి రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే మైనంపల్లిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదు : ఎస్సార్ ప్రసాద్

**నేరెడ్‌మెట్, అక్టోబర్ 29 ప్రభాతవార్త :** మల్కాజిగిరి నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యేఅభ్యర్థి మైనంపల్లి హన్మంత్‌రావుపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని కాంగ్రెస్ నాయకులు ఎస్సార్ ప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేసారు. ఆదివారం నేరెడ్‌మెట్ డివిజన్ పరిధిలోని మధురానగర్‌లో కపిల్, మేకల శ్రీనివాస్ యాదవ్‌లతో కలసి ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీం సాయి అతని అనుచరులు అల్వాల్ పోలీస్‌స్టేషన్‌లో మైనంపల్లిపై ఫిర్యాదు చేయడం సరైంది కాదన్నారు. నిత్యం ప్రజలకోసం పాటుపడే మంచి పేరున్న వ్యక్తిపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. మరోసారి ఇటువంటి ఫిర్యాదులు చేస్తే చర్యలు కఠినంగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో చెన్నారెడ్డి, టిక్కం, అర్వరాజు, ప్రభావతి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి : బలాల

**మలక్‌పేట, అక్టోబరు 29 ప్రభాతవార్త:** ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. మలక్‌పేట లోని చావుని డివిజన్‌లో జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ మలక్‌పేట నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్న తనను మరల గెలిపించాలని కోరారు. అనంతరం చావుని డివిజన్ కార్పొరేటర్ సాలం షాహిద్ మాట్లాడుతూ డివిజన్‌లో మౌలిక వసతులు కల్పించడానికి పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమం.. అభివృద్ధి కొనసాగాలంటే మరో సారి ఆశీర్వదించండి : సబితారెడ్డి



కాలనీవాసుల ఆత్మీయ సమావేశంలో ప్రసంగిస్తున్న సబితా ఇంద్రారెడ్డి

**సరూర్‌నగర్, అక్టోబర్ 29 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పని చేశానని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి, బిఆర్ఎస్ అభ్యర్థి పట్లోళ్ళ సబితా ఇంద్రారెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం ఆమె బడంగ్ పేట్ కార్పొరేషన్‌లోని పెద్దబావి మల్లారెడ్డి గార్డెన్స్‌లో కాలనీ అసోసియేషన్లతో జరిగిన ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి హాజరై మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజల సంక్షేమానికి, ప్రాంతాల అభివృద్ధికి సిఎం కెసిఆర్, మంత్రి కెటిఆర్‌ల సహకారంతో వందల కోట్ల నిధులు తెచ్చి దీర్ఘ కాల సమస్యలను పరిష్కరించడంతో పాటు అభివృద్ధి పనులు చేసామని తెలిపారు. ప్రజలకు సాధారణ మౌళిక సదుపాయాలను కల్పించడంతో పాటు ముఖ్యంగా వరద ముంపు సమస్యలను తీర్చి ఆహ్లాదాన్ని అందించే విధంగా చెరువులను సుందరీకరించినట్లు ఆమె పేర్కొన్నారు. అర్హులైన ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందించి వారికుటుంబాలను సంతోషం నింపామని గుర్తు చేశారు. నియోజకవర్గంలో ప్రజా సంక్షేమం, ప్రాంతాల అభివృద్ధి కొనసాగించాలంటే తనను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చప్పిడి సంతోష్‌రెడ్డి, రామిడి రాంరెడ్డి, సూర్ణగంటి అర్జున్, బోయపల్లి దీపిక శేఖర్‌రెడ్డి, భీమిడి స్వప్న జంగారెడ్డి, గుర్రం ప్రసన్న వెంకట్‌రెడ్డి, సంరెడ్డి స్వప్న వెంకట్‌రెడ్డి, ముత్యాల లలిత కృష్ణ, కుంచ నాగేందర్‌గౌడ్, ఎర్రబట్టు శ్రీనివాసరాజులతో పాటు పలువురు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పార్టీని గెలిపిస్తామని రాజ్ రంజిత్ కాలనీవాసుల ఏకగ్రీవ తీర్మాణం



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి తదితరులు

**తుర్కయంజాల్, అక్టోబరు 29 ప్రభాతవార్త:** తుర్కయంజాల్ మున్సిపాలిటీ కమ్మగూడ 22వ వార్డు రాజ్‌రంజిత్ కాలనీలో ఏర్పాటు చేసిన అన్ని కాలనీల అధ్యక్ష, కార్యదర్శుల సమావేశం బిఆర్ఎస్ వార్డు అధ్యక్షులు గుండ్ల రాజిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజ్‌రంజిత్ కాలనీతో పాటు పలు కాలనీల ప్రజలు కిషన్‌రెడ్డికి ఓటువేసి గెలిపిస్తామని ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు సేవ చేసేందుకు తనకు మరోసారి అవకాశం కల్పించాలని, బీఆర్ఎస్‌తోనే నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ వైస్‌చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, ఫ్లోర్‌లీడర్ కల్యాణ్‌నాయక్, కౌన్సిలర్ నారని కవితాశేఖర్‌గౌడ్, నాయకులు కందాడ లక్ష్మారెడ్డి, రొక్కం చంద్రశేఖర్‌రెడ్డి, కందాడ ముత్యంరెడ్డి, జక్కా రాంరెడ్డి, కాకుమాను చిన్నయ్య, తావుల శ్రీనాథ్, రాయబండి వెంకటేశ్ చారి, అలివేలు, సరిత, జయ తదితరులు పాల్గొన్నారు.

**కార్తీక్, యాదిరెడ్డి ఆధ్వర్యంలో...** మున్సిపాలిటీలో ఇంటింటికి, గడప గడపలో ప్రచారంలో భాగంగా మున్సిపల్ యూత్ అధ్యక్షుడు కొత్తకుర్మ కార్తీక్, బూత్‌కన్వీనర్ కొంతం యాదిరెడ్డి ఆధ్వర్యంలో బిఆర్ఎస్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమలను వివరిస్తూ మంచిరెడ్డి కిషన్ రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అశ్విని, జొన్నాడ రాంరెడ్డి, శ్రవణ్ కుమార్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, బొక్క బాల్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, రవీందర్, మేతరి శంకర్, శ్రీధర్‌రెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## నవంబర్ 5వ తేదీన ఉప్పల్‌లో విశ్వకర్మ మహాజన బహిరంగ సభ



రామంతాపూర్‌లో జరిగిన విశ్వకర్మ సంఘం సమావేశంలో పాల్గొన్న సంఘం నేతలు వెంకటచారి, మధన్‌మోహన్‌చారి, విష్ణుచారి తదితరులు

**ఉప్పల్, అక్టోబరు 29 ప్రభాతవార్త :** ఉప్పల్ భగాయత్‌లో వచ్చే నెల 5వ తేదిన తెలంగాణ విశ్వబ్రహ్మణ, విశ్వకర్మ మహాజన బహిరంగసభ నిర్వహిస్తున్నట్లు సంఘంచైర్మన్ లాలుకోట వెంకటచారి, అధ్యక్షులు వేములవాడ మధన్ మోహన్ ఆచార్య, ప్రధాన కార్యదర్శులు రాళ్లబండి విష్ణుచారి, చొల్లేటి కృష్ణమాచారి, అంజనేయచారి, కె.వేణుగోపాలచారి, కాసోజు నరసింహాచారి, సి.రవిచారి, గుంటోజు భీష్మాచారిలు తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ అర్థికంగా, సామాజికంగా రాణించేందుకు విశ్వబ్రహ్మణ, విశ్వకర్మ కులస్థులు కృషి చేయాలని కోరారు. విశ్వబ్రహ్మణుల సమస్యల పరిష్కారం కోసం పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విశ్వకర్మ కులస్థులు ఈ బహిరంగ సభకు హాజరవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో విశ్వకర్మ సంఘం నేతలు పుల్లిగిల్ల శ్రీనివాసాచారి, నాగారం భాస్కరాచారి, పబ్బోజు బిక్షపతిచారి, శశిధర్‌చారి, సత్యంచారి, సోమాచారి, దానకర్ణచారి, కిషన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అధిష్టానం పునరాలోచించాలి : దేప



సమావేశంలో మాట్లాడుతున్న భాస్కర్ రెడ్డి

**హైదరాబాద్, అక్టోబర్ 29 ప్రభాతవార్త:** మహేశ్వరం అసెంబ్లీ అభ్యర్థిత్వంపై కాంగ్రెస్ పార్టీ అధిష్టానం పునరాలోచన చేయాలని టీపీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఆర్‌కెపురం కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు పున్న గణేష్ అధ్యక్షతన స్వాగత్ గ్రాండ్ కన్వెన్షన్ హాల్‌లో మహేశ్వరం కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10 సంవత్సరాల నుంచి నియోజకవర్గంలో పార్టీని భుజాలపై మోస్తున్న తనలాంటి వారికికాకుండా ఉమ్మడి రంగారెడ్డి జిల్లా సీనియర్ నాయకుడు అనే నెపంతో కిచ్చన్నగారి లక్ష్మారెడ్డికి టికెట్ కేటాయించడం సబబు కాదన్నారు. నియోజకవర్గంలో తనతోపాటు టికెట్ ఆశించిన నేతలలో ఎవరికి కేటాయించినా పార్టీని గెలిపిస్తామని అన్నారు. సమయం మించిపోలేదని, అధిష్టానం ఆలోచన చేయాలని కోరారు. లేని పక్షంలో పార్టీ తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డి, బండి మధు, కాకి ఈశ్వర్‌ముదిరాజ్, సామిడి గోపాల్‌రెడ్డి, నల్లెంకి ధనరాజ్‌గౌడ్, హైటెక్ రాము, బొక్క భూపాల్ రెడ్డి, తలాటి రమేష్ నేత, మురళీ, చేపంగి ప్రవీణ్, ప్రసాద్, చౌకీ సుమన్, శేఖర్‌ముదిరాజ్, వంగాల శ్రీకాంత్‌రెడ్డి, రవి, హబీబ్, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీనుండి బి ఫారం సాధించే వరకు తగ్గేదే లేదు: చిగిరింత పారిజాత



భవిష్యత్ కార్యాచరణ సమావేశంలో ప్రసంగిస్తున్న పారిజాత నర్సింహారెడ్డి

**సరూర్‌నగర్, అక్టోబర్ 29 ప్రభాతవార్త:** మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గం నుండి కాంగ్రెస్ తరపునే పోటీ చేసేందుకు బి ఫారం సాధించేవరకు పోరాడుతూనే ఉంటా.. తగ్గేదే లేదని టిపిసిసి ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి స్పష్టం చేశారు. నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా స్థానికేతరుడైన కిచ్చన్నగారి లక్ష్మారెడ్డిని పార్టీ అధిష్టానవర్గం ప్రకటించడంతో భవిష్యత్ కార్యాచరణ నిర్ణయించేందుకు ఆదివారం ఆమె నియోజకవర్గవ్యాప్తంగా ఉన్న తన వర్గీయులైన పార్టీ శ్రేణులతో బాలాపూర్ చౌరస్తా సమీపంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో భారీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తీవ్ర భావోద్వేగంతో ఆమె ప్రసంగిస్తూ తాను కాంగ్రెస్‌నే వీడే ప్రసక్తే లేదనీ చివరి శ్వాస వరకు పార్టీలోనే ఉంటానని వెల్లడించారు. ఎఐసిసి పెద్దలు తనకు న్యాయం చేస్తారనే విశ్వాసం ఉందనీ ఈ నేపథ్యంలో ఢిల్లీకి వెళ్ళి కొట్లాడి అయినా బిఫారం సాధించి మహేశ్వరం నియోజకవర్గం నుండి పోటీ చేస్తానని ఆమె ఆకాంక్ష వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చిగిరింత నర్సింహారెడ్డి, కప్పాటి పాండురంగారెడ్డి, రాళ్ళగూడెం సంతోష శ్రీనివాస్‌రెడ్డి, ఎర్ర జైహింద్, బండారి మనోహర్, నేనావత్ బాలు నాయక్, కందాడి శ్రీరాంరెడ్డి, పెత్తుల్ల ఆనంద్‌రెడ్డి, బాల్‌నింగని జంగయ్య, గట్టు బాలకృష్ణ, బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, గుర్రం లక్ష్మారెడ్డి, సుభాన్‌యాదవ్, దయాసాగర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజల కోసమే పని చేస్తా : ఎమ్మెల్యే మైనంపల్లి



సమావేశంలో మాట్లాడుతున్న మైనంపల్లి హన్మంత్‌రావు..

**నేరెడ్‌మెట్, అక్టోబర్ 29 ప్రభాతవార్త :** ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం తన ప్రాణాలు ఇవ్వడానికైనా సిద్ధమని మల్కాజిగిరి నియోకజవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మైనంపల్లి హన్మంత్‌రావు పేర్కొన్నారు. ఆదివారం యాప్రాల్ శైలీగార్డెన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తూ వారి అభివృద్ధి పాటుపడతానన్నారు. రానున్న ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు బాల్‌రెడ్డి, రఘుప్రసాద్, రాఘవేంద్ర, జగన్నాథరావు, కిషన్, కిరణ్, శిరీష్, శ్రీనివాస్‌యాదవ్, చెన్నారెడ్డి, శ్రీనివాస్, సందీప్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఆర్కేపురంలో బిఆర్ఎస్ నాయకుల ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న అరవిందశర్మ

**హైదరాబాద్, అక్టోబర్ 29 ప్రభాతవార్త:** ఆర్కేపురం డివిజన్లో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి సబిత ఇంద్రారెడ్డిని గెలిపించాలని కోరుతూ విస్తృత ప్రచారం చేపట్టారు. మహేశ్వరం నియోజకవర్గం బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ ఆధ్వర్యంలో ఆదివారం ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలను అందజేసి నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని చూసి సబితాఇంద్రారెడ్డికి ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బిఆర్ఎస్ మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ పటేల్ సునీతారెడ్డి, రవీందర్‌రెడ్డి, పెంబర్తి శ్రీనివాస్, శేఖర్ పాల్గొన్నారు.

## ఇంజాపూర్ శ్రీ వెంకటేశ్వర కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన శ్రీ వెంకటేశ్వర కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీ

**తుర్కయంజాల్, అక్టోబరు 29 ప్రభాతవార్త:** తుర్కయంజాల్ మున్సిపాలిటీ ఇంజాపూర్ 14వ వార్డు శ్రీ వెంకటేశ్వర కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఎన్నికయింది. కాలనీ అధ్యక్షులుగా బుర్ర వెంకటేష్, ఉపాధ్యక్షులుగా కాసరమోని శ్రీశైలంయాదవ్, ప్రధాన కార్యదర్శిగా దుదుకు పాండు, సంయుక్త కార్యదర్శిగా ధనంజయరెడ్డి, కోశాధికారిగా హరినాయక్, కార్యవర్గ సభ్యులుగా సిలువేరు శంకర్, వై.దాసు, నూతన అధ్యక్షునిగా ఎనినకైన వెంకటేష్ మాట్లాడుతూ అధికారులు, ప్రజా ప్రతినిధుల సహకారంతో కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు, ఈ కార్యక్రమంలో కాలనీ సభ్యులు రాజేంద్రప్రసాద్, ధర్మారావు, సాంబశివుడు, రావులకోల్ నరేష్ పాల్గొన్నారు.

## ప్రచారంలో దూసుకుపోతున్న బండారి లక్ష్మారెడ్డి



జమ్మిగడ్డలో బండారి లక్ష్మారెడ్డికి స్వాగతం పలుకుతున్న ఓటర్లు.

**కుషాయిగూడ, అక్టోబర్ 29, ప్రభాతవార్త :** భారీ మెజారిటీతో గెలుపే లక్ష్యంగా దూసుకుపోతున్న ఉప్పల్ నియోజకవర్గ బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి కార్యకర్తల్ని కలుపుకుపోతూ ఏఎస్‌రావునగర్ డివిజన్‌లో ఇంటింటికి తిరుగుతూ ఓటర్ల మద్దతు కూడగట్టుకుంటూ ప్రచారం చేశారు. మహిళా ఓటర్లు మంగళ హారతులతో ఘనంగా స్వాగతం పలిపారు. బిఎల్ఆర్‌ను అధిక మెజార్టీతో గెలిపించుకుంటామని వారు ప్రకటించారు. ఈ ప్రచారంలో నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి, తాడూరి శ్రీనివాస్, కొత్త రామారావు, పావనిరెడ్డి,నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.